


మంగళవారం 27.08.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -189 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## ప్రజలకు అందుబాటులో ఇసుక వివరాలు

● గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఇసుక వివరాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించామని గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో 62 స్టాక్‌యార్డుల ద్వారా వినియోగదారులకు ఇసుక సరఫరా అవుతుండగా, జూలై 8 నుండి సోమవారం వరకు 21,47,883 మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు దారులకు చేరిందన్నారు. సీఎం సూచనల మేరకు బుకింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. 26వ తేదీన 22,114 మెట్రిక్ టన్నుల మేర 1,748 బుకింగ్‌లు జరిగాయన్నారు. 1609 ఆర్డర్లకు గానూ 20,552 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. రాష్ట్రంలో ఇసుక ముగింపు నిల్వ 16,63,263 ఎంటి గా ఉందన్నారు. 139 ఆర్డర్‌లకు సంబంధించి 1,562 ఎంటి ఇసుక డెలివరీ పెండింగ్‌లో ఉందని, అది కూడా పొద్దుపోయే సమయానికి పూర్తి అవుతుందని మీనా పేర్కొన్నారు.

## త్వరలోనే చెత్త పన్ను రద్దు..

● మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ పాలనలో అవినీతి కొత్త పుంతలు తొక్కిందని మంత్రి నారాయణ అన్నారు. టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.వేల కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖల వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. మున్సిపల్ శాఖలోని సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్త పన్నును కూడా త్వరలోనే రద్దు చేస్తామని తెలిపారు. తిరుపతి నగరపాలిక, పట్టణాభివృద్ధి అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. తిరుపతిలో తాగునీటి సరఫరా, యూడీఎస్‌ల పనితీరుపై సమీక్ష చేశారు. కండలేరు, బాలాజీ జలాశయాల్లో నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి వాసులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తాగునీటిని వారానికి ఒకసారి పరీక్షించాలని సూచించారు. టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణకు కమిటీ వేశామని మంత్రి నారాయణ తెలిపారు. కమిటీ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలను తేలుస్తామని స్పష్టం చేశారు.

2014-19 మధ్య ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధి జరిగిందని మంత్రి నారాయణ తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా కేటాయించలేదని ఆరోపించారు. 2023-24లో కేంద్రం కేటాయించిన నిధులను దారిమళ్లించారని అన్నారు. తుడాలో జీతాల కోసమే రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఏ అభివృద్ధి సంస్థకూ లేని రీతిలో తుడాలో ఖర్చులు చేశారని మండిపడ్డారు. ఉద్యోగులను నియమించి సొంత పనులకు వాడుకున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అగ్నిమాపక, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలతో తమ శాఖ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. ప్రజలను తిప్పకుండా వీలైనంత తొందరగా అనుమతులు ఇవ్వాలని ఆదేశించామని చెప్పారు.

## గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసేశారు

- ఏ శాఖలో చూసినా అప్పులు తప్ప ఆదాయమే లేదు
- ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నాం
- పారదర్శంగా అధికారుల బదిలీలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. గత ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని.. రూ. 13లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. ఏ శాఖను రివ్యూ చేసినా.. ఎక్కడా అప్పులు తప్ప ఆదాయమే కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఒక్కొక్క హామీని నెరవేరుస్తుందని అచ్చెన్నాయుడు తెలిపారు. పెంచిన పింఛన్లను రాజకీయ, పార్టీలకు అతీతంగా అందించామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. ఛాలెంజింగ్‌గా ఉన్న కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు మెచ్చే నాయకుడిగా పనిచేసి చూపిస్తానని వెల్లడించారు. అధికారుల బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపైనా మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. అధికారుల బదిలీలు పారదర్శంగా జరుగుతాయని తెలిపారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు బదిలీల కోసం ఒక్క పైసా ఇచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బదిలీల కోసం పైరవీలను ప్రోత్సహించ వద్దని సూచించారు.

# 'టార్గెట్ 100 డేస్'

- గత ప్రభుత్వం కంటే భిన్నంగా...
- పాలనలో సమూల మార్పులు తెచ్చేలా...
- తమ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా...
- 100 రోజుల్లో వీలైనన్ని ఎక్కువ పనులు
- అధికారులకు 100 డేస్ టార్గెట్ ఇచ్చిన చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గేర్ మారుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సెప్టెంబర్ 22తో 100 రోజులు పూర్తవుతుంది. 100 రోజుల్లో మార్పు చూపిస్తానంటూ ఇదివరకే సీఎం చంద్రబాబు ప్రకటించారు. మరి టైమ్ దగ్గరపడుతోంది. ఆలోగా ఏం మార్పులు సాధించామనేది ప్రజలకు చెప్పాలని, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా చూపించాలని అధికారులకు టార్గెట్ ఫిక్స్ చేశారు సీఎం చంద్రబాబు. కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన ఫలితాలు ప్రజలకు స్పష్టంగా తెలిసేలా చేయాలని చెప్పారాయన. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 5 కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు చంద్రబాబు. అందులో పెన్షన్ల పెంపు మాత్రమే తక్షణం ప్రజలకు ఉపయోగపడింది. అన్న క్యాంటీన్ల వల్ల కేవలం కొంతమంది ప్రజలకు మాత్రమే లబ్ధి చేకూరుతోంది. స్కిల్ సెన్సెస్ వల్ల ఏమేరకు ప్రయోజనం ఉందో తేలాల్సి ఉంది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది కానీ పెద్దగా స్పందన లేదు. ఇక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు నిర్ణయాన్ని హైలైట్ చేయాలనుకున్నా కుదర్లేదు. రాగా పోగా పెన్షన్ల పెంపు మాత్రం చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికి ప్లస్ అయింది. వీటితోపాటు ఉచిత ఇసుక విధానం కూడా తెరపైకి వచ్చినా దానిపై విమర్శలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. పంచాయతీలకు నిధులు విడుదల, కేంద్ర బడ్జెట్ లో ఏపీకి కేటాయింపులు, ఏపీకి తరలి వస్తున్నాయని చెబుతున్న కంపెనీలు.. ఇదంతా తమ 100 రోజుల ఘనతేనని చెప్పుకోబోతున్నారు సీఎం చంద్రబాబు.

మొన్నటి ఎన్నికల్లో అనూహ్య రీతిలో గ్రాండ్ విక్టరీ కొట్టిన కూటమి సర్కార్.. తమ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కసరత్తు చేస్తోంది. ఆ మేరకు మొదటి రోజు నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తూ.. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఫోకస్ పెట్టింది. పాలనలో సమూల మార్పులు తెచ్చేలా అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చింది. ప్రధానంగా.. గత ప్రభుత్వ తప్పిదాలను 100 రోజుల్లోనే సరిదిద్దేలా చర్యలు చేపట్టింది. మొదటి 100 రోజుల పాలన లో గత ప్రభుత్వం కంటే భిన్నంగా చేశామని చెప్పేలా నిర్ణయాలు, కార్యాచరణ, విజయాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. దీంతో ఆమేరకు లక్ష్యాలను ఏర్పరచుకుని ఆ టార్గెట్ పై దృష్టి సారించాయి అన్ని శాఖలు. సెప్టెంబర్ 22వ తేదీకి 100 రోజుల పూర్తి కానున్నాయి. ఇక కేవలం 26 రోజుల గడువు మాత్రమే ఉండడంతో వడివడిగా 100 ప్రణాళికకు అడుగులు పడుతున్నాయి.

ముఖ్యమంత్రి స్పష్టమైన సంకేతాలతో అన్ని శాఖలు దాదాపు లక్ష్యాలను చేరుకునేలా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఆ యాక్షన్ ప్లాన్‌కు గడువు 26 రోజులు మాత్రమే ఉండడంతో మరోసారి అన్ని శాఖలను అప్రమత్తం చేశారు సీఎం చంద్రబాబు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీల అమలుపైనా పలు సూచనలు చేశారు. దాంతో.. వంద రోజుల ప్రణాళికకు సంబంధించిన కీలక ప్రతిపాదనలను వివిధ శాఖలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపాయి.

రెండు నెలలుగా నిరంతరం అన్ని శాఖలను సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ఆయా రివ్యూల్లోనే 100 రోజుల ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వడంతో అధికార యంత్రాంగం స్పీడ్ పెంచింది. ప్రధానంగా.. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, రాజధాని అమరావతిపై స్పెషల్ ఫోకస్.. వ్యవసాయశాఖపై దృష్టి, విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించడం, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌కు యుద్ధ ప్రాతిపదికన భూమి కేటాయింపు, ఫీజు రీయింబర్స్‌మెంట్, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, ఎంఎస్ఎంఈ సెక్టార్లలో ఇన్సెంటివ్స్ ప్రకటన లాంటి అంశాలపైనా దృష్టి సారించాయి ఆయా శాఖలు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆయా శాఖల మంత్రులు కూడా అలెర్ట్ అయ్యారు. దానిలో భాగంగా..

2లో

## విశాఖ పిఎఫ్ ఆఫీసులో మురిగిపోతున్న రూ.600 కోట్లు




- 9 నెలలుగా పెన్షన్ ఇవ్వకుండా అధికారుల తాత్సారం
- హయ్యర్ పెన్షన్‌దారుల్లో హై టెన్షన్ !

**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** నెల నెలా తక్కువ పెన్షన్ పొందుతున్న వారికి ఓ ఆప్షన్‌తో ఎక్కువ పొందొచ్చని చెప్పి రూ.వందల కోట్లు వారి నుంచి వసూలు చేసి 9 నెలలుగా ఒక్క రూపాయి కూడా వారి పెన్షన్ ఖాతాల్లో అధికారులు జమ చేయలేదు. ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల్లో 2,900 మందిని హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌కు అర్హులుగా ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్) రీజనల్ కమిషనరేట్ కార్యాలయం గుర్తించింది. వీరిలో 1600 మంది నుంచి సుమారు రూ. 600 కోట్లు వసూలు చేసిన సదరు కార్యాలయ అధికారులు 2023 సెప్టెంబర్ నుంచి ఏ ఒక్కరికీ పెన్షన్ చెల్లించకుండా తీవ్ర తాత్సారం చేయడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.

**ఈ తతంగం ఎలా మొదలైంది?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న వారికి, కాంట్రాక్టు, ప్రయివేట్ సంస్థల్లో పనిచేసే వారికి ఇపిఎఫ్ వర్తిస్తుంది. ప్రయివేట్, కాంట్రాక్టు ఉద్యోగుల వరకూ పిఎఫ్ జమ చేయడంలో పెద్దగా ఇబ్బందులు లేవు. కేంద్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు జీతాలకు తగ్గట్టుగా పెన్షన్ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో లేదు. గతంలో ఎంత బేసిక్ (జీతం) ఉన్నా

2లో

## వైసీపీ పాలనలో ప్రతి గ్రామంలో భూ కబ్జాలే



- 1వ తేదీ నుండి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- ప్రజల సమస్యల పరిష్కారానికి వీఆర్వో నుండి కలెక్టర్ వరకు గ్రామాల్లోనే అధికారులు
- ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా గ్రీవెన్స్ కు వచ్చే ప్రజా వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తోన్నామని.. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో నాయకులు మాజీ శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, శ్రీరాం చిన్నబాబులతో నిర్వహించిన గ్రీవెన్స్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 1వ తేదీ నుండి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోన్నామని.. గత ఐదేళ్ల పాలనలో జరిగిన భూ దోపిడీలు, ఆన్ లైన్ ట్యాంపరింగ్

2లో

## వైసీపీ కూసాలు కదిలిస్తున్న చంద్రబాబు చాణక్యం

**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ బలం ఎక్కడ ఉంది అంటే గ్రామాలలోనే. 2019 ఎన్నికల్లో కూడా అర్బన్ సెక్టార్ టీడీపీకే ఎక్కువగా ఓట్లేసింది. ఉన్నత వర్గాలు మధ్య తరగతి వర్గాలు ఇలా చాలా మంది ఉండే అర్బన్ లో ఓటు ఎక్కువగా టీడీపీకి వెళ్తుంది. ఇక వైసీపీకి రూరల్ లో బేస్ ఎక్కువ.

ఆ పార్టీ పుట్టిన దగ్గర నుంచి ఓటు బ్యాంక్ రూరల్ లోనే పటిష్టంగా ఉంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు వైసీపీకి 2024 ఎన్నికల్లోనూ రూరల్ ఓటర్లు బాగానే ఓట్లేశారు అని అర్థం అవుతుంది. ఆ ఓట్లు అన్నీ కలవబట్టే వైసీపీకి నలభై శాతం ఓటు షేర్ లభించింది.

అయితే వైసీపీని దెబ్బ తీయాలీ అంటే రూరల్ ఓటునే టార్గెట్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లుగా ఉంది. అందుకే గ్రామ సభలను ఈసారి పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామాలను అభివృద్ధి చేసేది కూటమి ప్రభుత్వమే అని చంద్రబాబు నుంచి పవన్ కళ్యాణ్ వరకూ చెప్పారు. గ్రామాలకు తామే ప్రగతి దారులు చూపిస్తామని వారికి దండీగా నిధులు ఇస్తామని చెప్పారు. ఇక ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా గ్రామ సభలు జరగడం కూడా గొప్ప విషయమే. పైగా ఈ గ్రామ సభలలో సర్పంచ్ అధ్యక్షత వహించారు. అలా సీఎం డిప్యూటీ సీఎం,



ఎమ్మెల్యేలు మంత్రులు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్న సభలలో సర్పంచు హైలెట్ అయ్యారు.

పంచాయతీలకు నిధులు నేరుగా ఇస్తామని వాటితో గ్రామాలను అభివృద్ధి చేసుకోమని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇది సర్పంచులకు పంచాయతీ వార్డు మెంబర్లకు ఎంతో ఆనందం కలిగించే వార్త గానే ఉంది. సర్పంచులు వైసీపీ ఏలుబడిలో గత అయిదేళ్లుగా చిన్న మొత్తాన్ని కూడా కానలేదు.

పంచాయతీలకు నిధులు నేరుగా ఇస్తామని వాటితో గ్రామాలను అభివృద్ధి చేసుకోమని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇది సర్పంచులకు పంచాయతీ వార్డు మెంబర్లకు ఎంతో ఆనందం కలిగించే వార్త గానే ఉంది. సర్పంచులు వైసీపీ ఏలుబడిలో గత అయిదేళ్లుగా చిన్న మొత్తాన్ని కూడా కానలేదు. పంచాయతీలలో వీధి దీపాలు పోయినా కొని పెట్టించే స్తోమత

2లో

## ఏపీని టూరిస్ట్ హబ్‌గా మారుస్తాం

**కోనసీమ జిల్లా ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి టూరిస్ట్ హబ్‌గా మారుస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కోనసీమ జిల్లా పిచ్చుకలంక పర్యాటక ప్రాంతాన్ని ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులతో కలసి మంత్రి, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, బండారు సత్యానంద్‌రావు, అధికారులు సందర్శించారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్రిడ్జి వద్ద ఉన్న 56 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని వారు పరిశీలించారు. రాష్ట్రంలో గండికోట, తిరుపతి, విశాఖలో ఒబెరాయ్ సంస్థ రిసార్ట్స్ నిర్మాణాలు చేసేందుకు ఒబెరాయ్ అంగీకారం తెలిపిందని, అదే కోవలో పిచ్చుకలంకలోనూ రిసార్ట్స్ నిర్మాణం జరిగితే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు వస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న టెంపుల్ ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళను మించి అందాలు కోనసీమ జిల్లాలో ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటక రంగం తరఫున సహకారం అందిస్తామని వివరించారు.



## ఈవీఎంల వెరిఫికేషన్‌లో హైడ్రామా..



- తాళాలు లేవని 3 గంటలు కాలయాపన
- కలెక్టర్ అంబేద్కర్ ఆగ్రహం

**విజయనగరం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల తనిఖీ ఇప్పుడు పలు అనుమానాలను రేకిత్తిస్తున్నది. వైసీపీ పిటిషన్ మేరకు నెల్లిమర్లలో ఈవీఎంల వెరిఫికేషన్ కోసం వచ్చిన అధికారులు గోదాము తాళాలు లేవని మూడు గంటల పాటు కాలయాపన చేశారు.
వెరిఫికేషన్‌కు వచ్చిన అధికారులు తాళాలు కనిపించడం లేదని చెప్పడంతో కలెక్టర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తలుపులు పగులగొట్టి ఈవీఎంల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. గోదాం తాళాలు లేకపోతే బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలతో ఏం చేయాలో తెలియని అధికారులు చివరకు తాళాలు దొరికాయంటూ తీసుకొచ్చి ఇచ్చారు. దీంతో అప్పుడు ఈవీఎంల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు.
కాగా, పెదకాద పోలింగ్ బూత్ నంబర 20లో ఈవీఎంలు తనిఖీ చేయాలని, వీవీప్యాట్ లెక్కించాలని వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కానీ ఫిర్యాదుకు సంబంధం లేకుండా అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. పెదకాద ఈవీఎంలో డేటా మొత్తాన్ని అధికారులు తొలగించారు. వీవీప్యాట్ బాక్సుల్లోనూ వీవీప్యాట్‌లు కనిపించలేదు. ఈవీఎంలో డేటా తొలగించి కొత్త గుర్తులను లోడ్ చేశారు. కొత్త గుర్తులతో మాక్ పోలింగ్ నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అడిగినప్పటికీ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం సీసీ టీవీ ఫుటెజ్, బ్యాటరీ లెవల్ డేటాను ఎన్నికల అధికారులు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలులోనూ ఇదే పరిస్థితి రిపీట్ అయ్యింది. వెరిఫికేషన్‌కు బదులు కొత్త గుర్తులతో మాక్ పోలింగ్ నిర్వహించారు.

## జగన్... ఇంకెన్నాళ్ళు ఈ శవరాజకీయాలు ?




**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కార్మికుల కుటుంబాలను అడ్డం పెట్టుకుని రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విజయవాడలో ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పారిశ్రామిక వాడలో జరిగిన ప్రమాదాలపై వైసీపీ అనవసర రాజకీయం చేస్తుందని పేర్కొన్నారు.
రాష్ట్రంలో ఏ ప్రమాదం జరిగిన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందిస్తుందని వెల్లడించారు. అయితే వైసీపీ పాలన కంటే మెరుగైన పాలన కూటమి ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. అనకాపల్లి పరవాడ లో సినర్జిన్ బాధితులకు సైతం రూ. కోటి పరిహారం అందజేస్తామని అన్నారు. ఘటనలో మొత్తం నలుగురిలో ముగ్గురు చనిపోవడం దురదృష్టకరమని , బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , రాష్ట్ర మంత్రులు బాధితులను పరామర్శించి వారికి భరోసా కల్పించామని తెలిపారు.

## పోలీసుల అదుపులో వైకాపా నేత కొల్లం

**రైల్వేకోడూరు:** వైకాపా నేత, అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వేకోడూరులోని లక్ష్మీ థియేటర్‌కు సంబంధించిన స్థల వివాదం కేసులో అతడిని ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం థియేటర్ వద్ద గొడవ జరిగింది. ఈ విషయంలో థియేటర్ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, విచారణలో భాగంగా కొల్లం గంగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో సోమవారం గంగిరెడ్డి అనుచరులు థియేటర్ వద్ద గొడవకు దిగారు.
సోమవారం సాయంత్రం దాదాపు గంట పాటు రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో గంగిరెడ్డిని విచారించిన పోలీసులు ఆ తర్వాత విడిచిపెట్టారు. కానీ, ఎస్పీ విద్యాసాగర్‌కి సమాచారం ఇవ్వడంతో వెంటనే అతడిని తన వద్దకు తీసుకురావాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో మళ్లీ అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ప్రస్తుతం మదనపల్లెలోనే ఉండటంతో అక్కడికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పుల్లంపేట మండలానికి చెందిన గంగిరెడ్డి అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్‌గా పేరొందారు. పలు ఎర్రచందనం కేసుల్లో గతంలో తెదేపా ప్రభుత్వం గంగిరెడ్డిని అరెస్టు చేసింది. అయితే, వైకాపా హయాంలో అతడిని విడుదల చేశారు. ఆ తర్వాత ఆ పార్టీలో చేరిన గంగిరెడ్డి.. అనేక సెటిల్ మెంట్లు, భూదందాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# ‘టార్గెట్ 100 డేస్’




(మొదటి పేజీ తరువాయి)
హోంమంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి.. వంద రోజుల్లో గంజాయి నిర్మూలనకు సంబంధించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అటు.. సీఆర్డీఏ యంత్రాంగమూ అప్రమత్తమైంది. రాజధాని అమరావతి నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే చెన్నై, హైదరాబాద్ ఐఐటీ బృందాలతో అధ్యయనం చేయించి ఓ డిటేయిల్డ్ రిపోర్ట్ రెడీ చేయించింది. ప్రస్తుతం ప్రాథమిక నివేదిక అందగా.. ఎలా ముందుకెళ్లాలన్న దానిపై ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది ప్రభుత్వం.
డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటోంది. అందుకు అనుగుణంగానే అమరావతిని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే పనులు కొనసాగుతున్నాయి.
ఇక.. మరికొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. రాష్ట్రంలోని 13,326 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే గ్రామ సభలు పూర్తి చేసి ఉపాధి పనుల తీర్మానాలు విజయవంతంగా పూర్తి చేశారు చేశారు అధికారులు.
కార్పొరేషన్ల ఏర్పాటుపై కార్యాచరణ ప్రారంభమై తుది దశకు చేరుకుంది. మొత్తంగా.. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది కూటమి ప్రభుత్వం.
తాము సాధించిన ఘనత గురించి చెప్పుకోవడంతోపాటు.. గత వైసీపీ పాలనలో 100 రోజుల్లో ఏం జరిగిందనే విషయాలను కూడా కూటమి ప్రభుత్వం ప్రజల ముందుకు తేబోతోంది. వైసీపీ హయాంలో కొత్త పథకాలేవీ 100 రోజుల్లోపు మొదలు కాలేదని, అన్నిటినీ నిదానంగా ప్రారంభించారని, కొన్నిటిని ఆరు నెలల తర్వాత మొదలు పెట్టారని, మరికొన్నిటిని ఏడాది తర్వాత పట్టాలెక్కించారని అంటున్నారు.
అప్పట్లో ఆలస్యమైనా, ఇప్పుడు 100 రోజుల్లో వీలైనన్ని ఎక్కువ పనులు చేసినట్టు చెప్పుకోవాలనుకుంటున్నారు సీఎం చంద్రబాబు. సాధికారికంగా అధికారులతోనే ప్రభుత్వ విజయాలను ప్రచారం చేయించబోతున్నారు.

## వైసీపీ పాలనలో ప్రతి గ్రామంలో భూ కబ్జాలే

(మొదటి పేజీ తరువాయి)
లు, రికార్డుల తారుమారులాంటి సమస్యలను గ్రామాల్లోకి వచ్చే అధికారులకు ప్రజలు తెలియజేయాలని. గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తారని తెలిపారు. వీఆర్వో నుండి కలెక్టర్ వరకు అధికారులందరూ గ్రామాల్లోనే ఉండి బాధితుల నుండి విన్నపాలు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలన్నారు. రాబోయే ఐదేళ్లలో రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించి మంచి పేరు తెచ్చుకునేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
ఎన్నికలకు ముందు మదనపల్లిలో తమ భూమిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు ఆక్రమించి అక్రమంగా ఇళ్లు కట్టారని.. అక్కడికి వెళ్లి అడిగితే చంపుతామని బెదిరించడంతో.. అన్నమయ్య జిల్లా రాయచోటి జేసికి ఫిర్యాదు చేశామని.. తరువాత మదనపల్లి సబ్ కలెక్టర్ కు స్పందనలో అర్జీ ఇచ్చామని.. ఈ భూ ఆక్రమణపై విచారించి భూమిని కబ్జా చేసిన వారిపై, కబ్జాకు సహకరించిన తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మజరా సుద్దగుంట గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ జి. మురళీ నేడు గ్రీవెన్స్ లో వాపోయాడు.
పశ్చిమగోదావరి జిల్లా విప్పారు గ్రామానికి చెందిన గుడి మెట్ల కోటయ్య కు చెందిన వ్యవసాయ భూమి ని దేవాదాయ శాఖ బ్లాక్ లో పెట్టడంతో రిజిస్టర్ కాకపోవడంలేదని సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకురాగా సంబంధిత ఎండోమెంట్ కమిషనర్ కు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.
పంచాయతీరాజ్ డిపార్ట్ మెంట్ కు 31 సర్వీస్ ల ద్వారా ఓ బ్యాంకు ఖాతాకు వచ్చిన వందల కోట్ల నిధులు అలాగే బ్యాంకులో ఉన్నాయని. దాన్ని పీడీ ఖాతాకు మళ్లించి గ్రామాలో అభివృద్ధి పనులకు ఆ డబ్బులను వినియోగించాలని గుంటూరుకు చెందిన ఒక వ్యక్తి నేడు గ్రీవెన్స్ లో నేతలకు వినతిని అందించాడు తన పేరు భీ. రూపశ్రీ అని తాను %వీదీూా% చదువుకోవడానికి I-CET ఎగ్జామ్ రాశానని తనకు అందులో 8,239 ర్యాంక్ వచ్చిందని తనకు P.B సిద్ధార్థ కాలేజీలో సీటు వచ్చిందని.. కాలేజీ వారు సీటుకోసం రూ. 80.000 వేలు ఫీజు అడుగుతున్నారని.. తన తండ్రి డ్రైవర్ గా పనిచేస్తోన్నాడని.. అంత డబ్బు కట్టలేక తనను చదువు ఆగిపోమని చెప్పాడని.. తనకు చదువుకోవాలని ఉందని.. తాను శారీరక అంగవైకల్యం కలిగి ఉన్నాని.. తన చదువుకు సాయం చేయాలని మంత్రి మందు ఆమె వాపోయారు. వెంటనే మంత్రి ఆమెకు రూ. 20,000 ఆర్థిక సాయం చేశారు.
గిద్దలూరుకు చెందిన ఓ వృద్ధుడు తన భూ సమస్యపై మంత్రికి మొరపెట్టుకోగా.. మంత్రి వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యను వివరించారు. బాధితుడి సమస్యను తెలియపరిచి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాసాపేట గ్రామంలోని తన భూమి అన్యాక్రాంతం అయ్యిందని.. దానిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలంటూ పట్టణంలోని పాత రాయచోటికి చెందిన షేక్ సయ్యద్ బాష మంత్రికి విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని బాషకు హామీ ఇచ్చారు.



- గత 20 సంవత్సరాలుగా సంఘమిత్రలుగా పనిచేస్తోన్న తమని.. కింది స్థాయిలో నాయకులు తొలగించేందుకు ప్రయత్నిస్తోన్నారని.. వైసీపీ పార్టీకి అనుకూలంగా ఉన్నవారిని అలాగే ఉంచి తమను తొలగించేందుకు యత్నిస్తోన్నారని.. కుప్పం నియోజకవర్గం గుదుపల్లె మండలానికి చెందిన సంఘమిత్రలు నేడు మంగళగిరి గ్రీవెన్స్ లో నేతల ముందు వాపోయారు. తమను తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని దయచేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు వాపోయారు.
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జి.ఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఎమ్ డి జనరల్ మెడిసిన్ చదివిన తన కూతురు దొమ్మేటి తేజశ్రీకి గత ప్రభుత్వంలో ఫీజు రియంబర్స్ మెంట్ రాలేదని.. తన కూతురు చదువుకోసం అప్పులు చేయాల్సిన వచ్చిందని.. తనకు ఎటువంటి స్థిరాస్తులు లేవని దయ ఉంచి తన కూతురుకు రావాల్సిన ఫీజురియంబర్స్ మెంట్ వచ్చేలా చూడాలని తేజశ్రీ తండ్రి రామోహనరావు నేడు గ్రీవెన్స్ లో వాపోయాడు.
- 2013 లో రిటైర్ మెంట్ అయిన తనకు రావాల్సిన సెటిల్ మెంట్ బకాయిలు.. ఇంక్రిమెంట్ బకాయిలు తనకు ఇంకా ఇవ్వలేదని... కాకినాడ డిపోకు వెళ్లి మేనేజర్ ను ఎన్ని సార్లు అడిగినా పట్టించుకోవడంలేదని.. దయ చేసి తనకు రవాల్సిన బకాయిలను ఇప్పించాలని రాజమండ్రికి చెందిన సూర్యచంద్రరావు మంత్రి ముందు వాపోయాడు.
- పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం గాదెవారిపాలెం గ్రామానికి చెందిన గాదె సూర్యనారాయణ విజ్ఞప్తి చేస్తూ.. తాను టీడీపీకోసం పనిచేస్తోన్నానని తనను వైసీపీలోకి మారమంటే మారకపోవడంతో.. తనకు రావాల్సిన వర్క్ బిల్లులు అడ్డుకోవడమే కాకుండా.. తనపై అక్రమ కేసులు పెట్టి వేధించారని.. తన భూమిలో అక్రమంగా మట్టిని తవ్వేశారని.. తన భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోని.. తనకు రావాల్సిన బిల్లుల డబ్బులను ఇప్పించవలసిందిగా సూర్యనారాయణ నేడు గ్రీవెన్స్ లో వేడుకున్నాడు.

## విశాఖ పిఎఫ్ ఆఫీసులో మురిగిపోతున్న రూ.600 కోట్లు




(మొదటి పేజీ తరువాయి)
రూ. 6,500పైనే పిఎఫ్ కింద 8.5 శాతం కట్ చేసేవారు. 2014లో కొంతమంది ఉద్యోగుల కోరిక మేరకు ఈ స్లాబ్‌ను రూ. 15 వేలకు కేంద్రం పెంచింది. జీతం ఎక్కువ ఉండి పెన్షన్ జమ లిమిట్ రూ. 6,500 ఉన్నందున రిటైరయ్యాక పెన్షన్ తక్కువ రావడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతమంది ఉద్యోగులు పూర్తి జీతంపై పిఎఫ్ కట్ చేసి పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను నాడు ముందుకు తెచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి సర్కారు ఒక ఆప్షన్ ఇచ్చింది. దీని ప్రకారం 1995 నుంచి రిటైరయ్యే వరకూ ఎంత మొత్తం చెల్లించాలో ఇపిఎఫ్‌కు డిమాండ్ లెటర్లను విశాఖపట్నం పిఎఫ్ కార్యాలయం వడ్డీతో సహా లెక్క కట్టి 2,900 మందికి పంపింది. 58 సంవత్సరాలు ఉద్యోగికి వస్తే, పెన్షన్ నెలనెలా రావాల్సి ఉంది.
ఆ ప్రకారం ఆప్షన్ లెటర్లు వారికి ఇచ్చి అర్హత ఉంటే ఇపిఎఫ్ పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ లెటర్లను ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఉద్యోగులంతా 2023 సెప్టెంబర్ నుంచి అందుకున్నారు. ఈ క్రమంలో 1,600 మంది రూ. 600 కోట్లు జమ చేశారు. వీరిలో అత్యధిక మంది స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులే ఉన్నారు. 1995 నుంచి తాము రిటైర్ అయినంతవరకూ ఇపిఎఫ్ కార్యాలయానికి చెక్కుల రూపంలో చెల్లించిన మొత్తాన్ని విశాఖపట్నం రీజియన్ కార్యాలయం అట్టిపెట్టుకుంది. 2023 సెప్టెంబర్ నుంచి అంటే తొమ్మిది నెలలుగా ఒక్క రూపాయి కూడా ఏ ఒక్కరికీ పెన్షన్‌గా చెల్లించలేదు. దీంతో, పెన్షనర్లలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగుతోంది. హయ్యర్ పెన్షన్ కోసం ఉద్యోగులు రూ. కోట్లు చెల్లించినా, పెన్షన్ రాకపోవడంతో పలుసార్లు పిఎఫ్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. అయినా, పిఎఫ్ కార్యాలయం క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? ప్రశ్నగా మారింది.

## వైసీపీ కూసాలు కదిలిస్తున్న చంద్రబాబు చాణక్యం

(మొదటి పేజీ తరువాయి)
కూడా పంచాయతీలకు లేకుండా పోయింది. అలాగే పారిశుద్ధ్యం లేకుండా కాలువలలో మురుగు పారుతున్నా పూడికలు తీయించేందుకు పైసా లేదు. పంచాయతీ భవనానికి సున్నం కొట్టించే దిక్కులేదు. పంచాయతీల వైపు ముఖం చూసే వారు కూడా లేరు
. పోటీగా సచివాలయాలను ఏర్పాటు చేయడంతో అందరూ ఆ వైపు చూడడంతో విధులు నిధులు అధికారాలూ అన్నీ పోయి పంచాయతీ సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. ఈ నేపథ్యంలో పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకుని వస్తామని ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఇస్తున్న హామీలు వారిని పూర్తి స్థాయిలో కూటమి వైపుగా ఆకట్టుకునేలా చేస్తున్నారు. నిజం



చెప్పాలీ అంటే పంచాయతీలలో నూటికి తొంబై శాతం వార్డులలో మెంబర్లు కూడా కూటమి పార్టీలను వైసీపీ మద్దతుదారులే గెలిచారు. అయితే వారిని ఉదాశీనంగా ప్రభుత్వం చూడడంతో పాటు స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా చేయడం దారి మళ్ళించడంతో వారంతా వైసీపీ ప్రభుత్వం మీద గుస్సా అయ్యారు. చివరికి వారి ధర్మాగ్రహం కాస్తా ఎన్నికల్లో వైసీపీకి పనిచేయకుండా చేసింది.
అది కూడా వైసీపీ ఓటమికి ఒక అతి ముఖ్య కారణం అయింది. ఈ క్రమంలో పంచాయతీలను అభివృద్ధి చేస్తామని, బలోపేతం చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. దాంతో సహజంగానే సర్పంచులు ఆ వైపుగా టర్న్ అవుతున్నారు. అలాగే చాలా ఎంచుకుంటున్నాయి. ఇప్పటికే పంచాయతీలలో జనసేన టీడీపీ జెండాలు కనిపిస్తున్నాయి. రానున్న రోజులలో పార్టీని బలోపేతం చేసేందుకు ఇది ఒక అవకాశంగా జనసేన వాడుకుంటూంటే టీడీపీ కూడా గ్రామాలో వైసీపీని భూస్థాపితం చేయమని పిలుపు ఇస్తోంది. ఈ మొత్తం వ్యవహారం చూస్తూంటే పంచాయతీలలో ఫ్యాన్ నీడ లేకుండా చేసేందుకు కూటమి వేసిన ఎత్తుగడగా ఉందని అంటున్నారు. వైసీపీకి ఎటూ అర్బన్ ఓటింగ్ పెరిగే చాన్స్ లేదు. రూరల్ ఓటింగ్ నే పదిలంగా చూసుకోవాల్సి ఉంది. కానీ రూరల్ లో జనసేన టీడీపీ వేస్తున్న ఎత్తుగడలతో వైసీపీకి దెబ్బ పడిపోయేలా సీన్ కనిపిస్తోంది అని అంటున్నారు. ఈ పరిణామాలు వైసీపీకి రాజకీయంగా ఇబ్బంది పెట్టేలాగానే ఉన్నాయి. చూడాలి మరి వైసీపీ దీనికి కౌంటర్ పాలిటిక్స్ ఎలా చేస్తుందో.

# రూ. కోటి చొప్పున పరిహారం అందజేత

## ● సినర్జిన్ కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ

**అనకాపల్లి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనకాపల్లి జిల్లా జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారికి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని అందజేసింది. ఈ ఘటనలో చనిపోయిన ముగ్గురు కార్మికులకు ఒక్కో కార్మికుడికి రూ. కోటి చొప్పున ప్రభుత్వం ద్వారా పరిహారం అందజేశారు. ఈ నెల 23వ తేదీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.
నాటి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ నేడు విజయనగరం జిల్లాకు చెందిన ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మరో కార్మికుడి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. పరిహారం అందజేత, ప్రస్తుతం బాధితుడికి అందుతున్న వైద్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



కాగా.. పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ సంస్థ, యూనిట్ -3 లో జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులలో ముగ్గురు కార్మికులు జార?ండ్ వాసులు కాగా, ఒకరు విజయనగరం జిల్లాకు చెందినవారిగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. వీరిలో జార?ండ్‌కు చెందిన రోయ అంగిరియా(22), లాల్ సింగ్ (21) ఇప్పటికే మృతిచెందగా, మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సోమవారం విజయనగరం జిల్లా వాసి కె. సూర్యనారాయణ (35) ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కలెక్టర్ ప్రకటించారు. సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించినట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటన విడుదల చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

## అలరించిన శ్రీ కృష్ణ సంకీర్తన గానం



తెనాలి ( జర్నలిస్ట్ ఫైల్ ) : తెనాలి నందులపేట కుసుమహరనాథమందిర్ లో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా, సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 6:30 వరకు శ్రీ హరినామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో కృష్ణునిపై సంకీర్తన గానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత గురువు శ్రీ పెరవలి వంశీకృష్ణతో పాటు, అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి మాదలనాగ అర్చన, ఉప్పలూరి శారదాచలపతి, కొప్పరపు అనితమాధవి, తూనుగుంట్ల దుర్గా మల్లేశ్వరి, కొత్తమాసు పుష్పలత, పువ్వాడ సరిత, సురాబత్తుల కేశవరావు, వేమవరపు లక్ష్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు కృష్ణునిపై నిర్వహించిన గాన సంకీర్తనలను ఆస్వాదించారు.

## మానవతామూర్తి మదర్ థెరిసా : వైఎస్ జగన్



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : భారతరత్న, నోబెల్ గ్రహీత మదర్ థెరిసా మానవతామూర్తి అని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా జగన్ ఎక్స్ వేదిక ద్వారా స్పందించారు. ఎంతో మంది అనాథలు, అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాదు వారికి విద్యాబుద్ధులు చెప్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజలు, రోగ పీడితులు, కుష్టువ్యాధి గ్రస్తులూ, అనాథ పిల్లలే తన ఆస్తిగా భావించి వారందరినీ అక్కున చేర్చుకున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరంలోని నిర్మల్ హృదయ్ భవన్ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేలా సహాయ సహకారాలు అందించామని గుర్తు చేశారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ ప్రజలకు శ్రీకృష్ణా జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అందరిపైన, రాష్ట్రంపైన భగవంతుడి ఆశీస్సులు ఉండాలని అన్నారు. అధ్యాత్మికంగా శక్తినిచ్చే పండుగ ప్రజలందరినీ ఏకం చేస్తుందని, చెడును నిర్మూలించి ధర్మాన్ని కాపాడడంలో శ్రీకృష్ణుడి బోధనలు మానవాళికి ఆచరణీయమని అన్నారు.

## మంగళగిరి పట్టణంలో ఘనంగా లోకేష్, బ్రాహ్మణి వివాహ



- పట్టణ టిడిపి నేత గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో కేక్‌కట్.. విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) : మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతుల 17వ వివాహ వార్షికోత్సవ వేడుకలను మంగళగిరి పట్టణంలోని ఆంజనేయ కాలనీలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు , పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లోకేష్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ కాలనీలోని విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవాడ దుర్గారావు మాట్లాడుతూ నారా లోకేష్ దంపతులు నిండు నూరేళ్ళు అయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో జీవించాలని నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటరీ పద్మశాలి సాధికార సమితి సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ, వంగర పెద్ద లక్ష్మయ్య, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, మున్నంగి శివ శేషగిరి రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గోవాడ రవి, వెంకట రామాంజ నేయులు, బిట్ర నాగరాజు, జంపా ప్రభాకర్, పొట్లబత్తుల నరసింహారావు, రామకృష్ణ, ఆకురాతి లక్ష్మణ్, తెలుగు మహిళా నాయకురాలు గోవాడ వెంకటలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# ఏకీకృత పెన్షన్ విధానం అంగీకరించేది లేదు: యుటిఎఫ్



కడప (జర్నలిస్ట్ ఫైల్): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని చాలా సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అలాగే వివిధ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేస్తున్న ఈ తరుణంలో ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని ఎన్ పి యస్ పేరును మాత్రమే యూపీఎస్ గా మార్చి అమలు చేయుటకు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ తెలిపారు. ఈరోజు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ...

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందని పేర్కొన్నారు. యుపీఎస్ అనేది కేవలం ఆంధ్రప్రదేశ్ యొక్క అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్ యొక్క కాపీ అని మరియు ఎన్ పీఎస్ యొక్క సంస్కరణకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని, ఇది ఆమోదయోగ్యం కాదని వారు , తెలిపారు.

పాత పెన్షన్ స్కీమ్ ఒక ముఖ్యమైన రాజకీయ సమస్యగా మారింది, గత లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేసింది మరియు ఉద్యోగులలో కోపం మరియు సంభావ్య రాజకీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటే, కనీస ఉపశమనం అందించడానికి కేంద్ర ప్రభుత్వం యొక్క ఎత్తుగడ మోసపూరిత వ్యూహం. ఓపీఎస్ కోసం పోరాటం కొనసాగడమే కాకుండా మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.

పాత పెన్షన్ పథకానికి ప్రత్యామ్నాయం ఆమోదయోగ్యం కాదు. పాత పెన్షన్ పథకాన్ని పూర్తిగా పునరుద్ధరించాలి, పీఎఫ్ ఆర్ డీఏ ని రద్దు చేయాలి మరియు 10% జీతం తగ్గింపును నిలిపివేయాలి.

ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, జిల్లా సిపిఎస్ కన్వీనర్ రమణమూర్తి జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి, అక్రమ్ భాష, శ్రీధర్ రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానమే కావాలి

- ఎన్పీఎస్ కు కొనసాగింపుగా ఉన్న ఏ పెన్షన్ అయినా ఆమోదయోగ్యం కాదు
- 10% ఉద్యోగి కాంట్రిబ్యూషన్ కొనసాగింపు నిర్ణయం అసంబద్ధం
- ఇది మన రాష్ట్ర జిపిఎస్ కు మరో రూపంలో ఉంది.
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : దేశంలో కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న యుపిఎస్ అనేది ఉద్యోగులకు అంత ప్రయోజనంకరం కాదని... పాత పెన్షన్ మాత్రమే ప్రయోజనకరమని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ , మాగంటి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్పీఎస్ కు కొనసాగింపుగా చేసే ఎలాంటి విధానం అయినా అది ఉద్యోగులకు మరియు ప్రభుత్వాలపై భారం మాత్రమేనని దీంట్లో ఉద్యోగులకు ఒనగూరే ప్రయోజనాలు చాలా స్వల్పమని అభిప్రాయపడ్డారు. యుపిఎస్ విధానం గత ప్రభుత్వం మన రాష్ట్రంలో తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్స్ విధానానికి దగ్గరగా ఉందని దానిని మన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు ఆమోదించలేదనే విషయాన్ని స్పష్టం చేశారు. ఉద్యోగుల నిరంతర పోరాటం పెన్షన్ స్కీమ్ లో ఉన్నటువంటి అసంబద్ధత మరియు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్పీఎస్ నుంచి పాత పెన్షన్ వైపు వెళ్ళటం కారణంగా కేంద్ర ప్రభుత్వమే ఒత్తిడితో కొంత ప్రయోజనకరంగా ఉద్యోగుల ఒత్తిడి వలన తీసుకొచ్చిన యుపిఎస్ ను మరింత మెరుగుపరచాలని కోరారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఉద్యోగ నోటిఫికేషన్ వయస్సు దాదాపు 40 నుండి 45 సంవత్సరాల వరకు ఉందని పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు ఉన్నప్పుడు 30 సంవత్సరాల సర్వీస్ అర్హత పొందడం అసాధ్యమని అలాంటి సమయంలో ఉద్యోగి 50 శాతాన్ని పెన్షన్ గా పొందే హక్కును కోల్పోతాడని అభిప్రాయపడ్డారు.

యుపిఎస్ విధానం అనేది కార్పొరేట్ వ్యవస్థలకు లాభదాయకమని కేంద్ర ప్రభుత్వానికి గాని రాష్ట్ర ప్రభుత్వానికి కానీ ఉద్యోగులకు కానీ కలిగే ప్రయోజనం శూన్యమని అన్నారు.

కావున వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# శివ కృష్ణ గోశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న తులసిరెడ్డి.

కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) : వీరపునాయుని పల్లి మండలం,సంగాలపల్లి శివకృష్ణ గోసంరక్షణ శాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి,గోశాల నిర్వాహకులు కల్లూరు రాజశేఖర్ రెడ్డి,కల్లూరు రఘునాథ రెడ్డి,మూలె జయరామి రెడ్డి,నంద కుమార్ రెడ్డి,మల్లేశ్వరరెడ్డి, అనసూయమ్మ, చంద్రా రెడ్డి ,ఉత్తన్న,వినయ్ ,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ శ్రీ మహా విష్ణువు దశావతారాలలో శ్రీ కృష్ణావతారం 8 వ అవతారమని అన్నారు.

ద్వాపర యుగంలో కంసుడు,శిశుపాలుడు తదితర దుష్టులను శిక్షించి ధర్మాన్ని కాపాడేందుకు శ్రీకృష్ణుడు శ్రావణ మాసంలో కృష్ణ పక్షమి అష్టమి నాడు దేవకీ వసుదేవుల పుత్రునిగా జన్మించినాడన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత అనబడే విజ్ఞాన భాండాగారాన్ని సమాజానికి అందించారన్నారు. కృష్ణ కుచేలుర స్నేహం ఆదర్శం అన్నారు. కృష్ణుని జీవితం లో సగ భాగం గోవులు, గోపాలురు, గోపస్త్రీల చుట్టూ తిరుగుతుంది. గోమాత సేవ గోపాలుని, గోవిందుని సేవతో సమానమన్నారు. గోమాత ప్రదక్షిణం ముక్కోటి దేవతల ప్రదక్షిణంతో సమానం అన్నారు. ఉట్టి కొట్టుట కార్యక్రమం లో తులసి రెడ్డి పాల్గొన్నారు. విజేతలైన అనసూయమ్మ,చంద్ర కు బహుమతులు ప్రధానం చేసారు.

గత అనేక సంవత్సరాలుగా శివకృష్ణ గోశాలను నిర్వహిస్తూ,కృష్ణాష్టమి వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న రాజశేఖర్ రెడ్డి దంపతులను తులసి రెడ్డి అభినందించారు.

# భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ



గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్ ): రాష్ట్రంలో గత ప్రభుత్వ హాయంలో భూ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా చాలామంది ఉన్నారని, అందులో భాగంగానే సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆఫీసు దాసరి భవన్లో ఈనెల 28వ తేదీన భూ బాధితుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు మన నియోజకవర్గంలో ఉన్న భూ బాధితులు అందరూ పాల్గొనాలని సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దలు ప్రజల వద్ద నుండి దౌర్జన్యంగా లాక్కున్న భూములను భూ కబ్జాదారుల నుండి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, అలానే మండలంలో పేదలు ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకున్న సుందరయ్య కాలనీ,ఎన్టీఆర్ కాలనీ, సింహపురి కాలనీ, జాన్‌అప్పర కాలనీ వాసులకు నివేశిన స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు,దర్శి లింగారావు, గోపి సుబ్బారావు,బట్టు నాగేశ్వరరావు,ఆర్దల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పేపర్లకు ఉన్న విలువ కార్మికుల ప్రాణాలకు లేవా ?



- వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణీ విమర్శ

విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఏపీలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణీ విమర్శల దాడి చేశారు. ఎసెన్షియా ప్రమాదంలో సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. మదనపల్లిలో పేపర్లు తగలబడితే హెలికాప్టర్ పంపారని, ఉత్తరాంధ్ర ప్రజల ప్రాణాలు కోసం ఒక హెలికాప్టర్ పంపలేరా అని ఆమె అన్నారు. పేపర్లకు ఉన్న విలువ కార్మికుల ప్రాణాలకు లేవా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై విమర్శల చేయడానికి హోమ్ మినిస్టర్ అనిత అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అనిత భాష చూసి ప్రజలు సిగ్గు పడుతున్నారని అన్నారు. “అనిత సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు. నితా ఒక అసమర్థ హోం మినిస్టర్. వైఎస్ జగన్‌పై విమర్శలు పక్కన పెట్టి ఫార్మా ప్రమాదాల నివారణపై దృష్టి పెడితే బాగుంటుంది. అనితకు సన్మాల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు మీద లేదు. ఎల్జీ పాలిమర్ ప్రమాద సమయంలో వైఎస్ జగన్ పరామర్శకు రాలేదని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. అనిత అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు” అని వరుదు కళ్యాణి పేర్కొన్నారు.

## మన్యం జిల్లాలో ఘోరం.. ఏనుగుల దాడిలో వృద్ధుడు మృతి



అల్లూరి సీతారామరాజు మన్యం ( జర్నలిస్ట్ ఫైల్ ) : జిల్లాలో ఘోరం జరిగింది . ఏనుగుల దాడిలో వృద్ధుడు చనిపోయిన ఘటన కొమరాడ మండలం వన్నాం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. శివుడినాయుడు (62)అనే వృద్ధుడు సమీప వాగులో స్నానం చేసి ఇంటికి వెళుతుండగా అరటితోటలో ఉన్న ఏనుగులు అతడిపై దాడి చేశాయి. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

కుటుంబ సభ్యులు పోలీసులకు, అటవిశాఖాధికారులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి అధికారులు చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా ఏపీలోని చిత్తూరు, మన్యం ఏనుగుల బీభత్సవాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏపీ ప్రభుత్వం ఇటీవల కర్ణాటక ప్రభుత్వంతో చర్చించింది.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వయాన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అటవి మంత్రి, అక్కడి అధికారులతో మాట్లాడి కుంకీ ఏనుగుల కొరతను వారికి వివరించారు. కర్ణాటక, ఏపీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల సమస్య అధికంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు రెండు ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. అనంతరం 8 కుంకీ ఏనుగులను ఏపీకి అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది.

# ఉద్యమ కెరటం...చిన్ననాడే నాగళ్ళ రామకృష్ణయ్య

- ఈనెల 28న కమ్యూనిస్టు పోరాట యోధుడు
- దివంగత నాగళ్ళ 30 వ వర్ధంతి



మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) : అతనొక ఉద్యమ కెరటం. చిన్ననాడే నాగళ్ళ రామకృష్ణయ్య తల్లిదండ్రులు కమ్యూనిజాన్ని ఉగ్గుపాలతో పట్టారేమో కమ్యూనిస్టు జెండా చేతపట్టి ఉద్యమం వైపు అడుగులు వేశారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం ఏర్పరచుకున్నారు. కారణం ఆకలిపై ఆయన చేసిన పోరాటం. పేద ప్రజలకు కూడు, గూడు, వస్త్రం అందించాలనే ఆలోచన ఆయనది. కమ్యూనిస్ట్ పార్టీ త్యాగాలు, నిర్మాణాలు, పార్టీ గొప్పతనాలు ప్రజల్లోకి తీసుకెళ్లిన అలుపెరగని ఎర్రజెండా ముద్దుబిడ్డ నాగళ్ళ తుది శ్వాస విడిచే వరకు సిపిఐ ని మంగళగిరి నియోజకవర్గంలో బలోపేతం చేయడమే కాకుండా పార్టీ అభివృద్ధి చేసిన త్యాగశీలి ఆయన. ఏ సమయంలోనైనా తలుపు తడితే నేనున్నానంటూ తలుపు తెరిచి వారి సమస్య పరిష్కారం చేసి పంపే దయాగుణం కలిగిన వ్యక్తి. నిరాడంబరత ఆయన సొంతం. నాగళ్ళ వర్ధంతి 28వ తేదీన నిర్వహించనున్న సందర్భంగా ఆయన గురించి కొన్ని విషయాలు.

మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో నాగళ్ళ వెంకటరత్నం శేషమ్మ దంపతులకు తృతీయ సంతానం రామకృష్ణయ్య, జులై 14, 1924 సంవత్సరంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో పార్టీ కొరియర్ గా పనిచేశారు. ఆయన పోరాటపటిమా కమ్యూనిస్టు పార్టీలో నిజాయితీగా పనిచేయడానికి చూసి నాయకత్వం 1940 సంవత్సరంలో పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చింది. పెద్దవడ్లపూడి గ్రామ పంచాయితీ సర్పంచ్ గా రెండుసార్లు గెలుపొందారు. మంగళగిరి సమితి ఉపాధ్యక్షుడిగా చేశారు. నియోజకవర్గంలో సిపిఐ ని బలోపేతం చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు, భూములు ఇచ్చేలా పోరాటం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సిపిఐ తరఫున పోటీ చేసిన వేములపల్లి శ్రీకృష్ణను గెలిపించారు. విద్యార్థులు దూరం వెళ్లి డిగ్రీ చదువుతుంటే వారు మంగళగిరిలోనే చదవాలని డిగ్రీ కాలేజీ స్థాపనకు పరిమిషన్ తీసుకువచ్చి డిగ్రీ కాలేజ్ నిర్మాణానికి కృషి చేశారు. మంగళగిరి పట్టణ ప్రజల మంచి నీటి సమస్య పరిష్కరించారు. సాగు భూములను పేదలకు పంచారు.

పైలెట్ వాటర్ స్కీమ్ ఏర్పాటుకు కృషి చేశారు. పోరాటాల్లో భాగంగా పేద ప్రజల సమస్యలపై ఎన్నోసార్లు జైలుకెళ్లారు. క్యాన్సర్ వ్యాధి బాధపడుతూ ఆయన ఆగస్టు 28 1994 సంవత్సరంలో అమరులయ్యారు. గ్రామపంచాయతీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి,సిపిఐ దిమ్మెకు రంగులు వేసి ముస్తాబు చేశారు.

ఈనెల 28వ తేదీన, 30వ వర్ధంతి సందర్భంగా పెద్దవడ్లపూడి గ్రామంలో 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుచున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పెదవడ్లపూడి శాఖ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సానుభూతిపరులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68



బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ద్వి దశాబ్ది కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు

# డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తం

## యువత కోసం స్కిల్ వర్సిటీ పనులు ప్రారంభించినం

- రైతులకు రూ. 31 వేల కోట్లు మాఫీ చేసినం
- రాష్ట్ర ప్రభుత్వానికి బ్రహ్మ కుమారీస్ మార్గదర్శకులు
- బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్వి దశాబ్ది వేడుకల్లో సీఎం

**హైదరాబాద్, ఆగస్టు26** డ్రగ్స్ పదం వింటేనే భయపడేలా డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్స్ టీమ్ ను ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆదివారం బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ద్వి దశాబ్ది కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. ఇది ప్రజా ప్రభుత్వమని, రైతు ప్రభుత్వమని తెలిపారు. రైతు రుణమాఫీ చేసి తమది రైతు ప్రభుత్వం అని నిరూపించుకున్నామన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా ఎనిమిది నెలల్లోనే రూ.31 వేల కోట్లు రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని ఆయన తెలిపారు. యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుంటున్నామని.. 60 ఎకరాల్లో రూ. 300 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వివరించారు. ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని.. అక్కడే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. బ్రహ్మకుమారీస్ బాటలో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని చెప్పారు. ఇరవయ్యేండ్లలో గచ్చిబౌలి పెద్ద నగరంగా అభివృద్ధి చెందిందని, ఈ ప్రాంతంలో శాంతి సరోవర్ ఉండటం సంతోషకరమైన విషయమని సీఎం అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి బ్రహ్మకుమారీస్ మార్గదర్శకులని, శాంతి సరోవర్ కు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. శాంతి సరోవర్ లీజ్ రెన్యూవల్ చేసి వారికి అన్నివిధాలా సహకరిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే అకడమిక్ ఇయర్‌లో స్పోర్ట్స్ వర్సిటీ

## స్పోర్ట్స్‌విలేజ్‌గా గచ్చిబౌలి: సీఎం రేవంత్ రెడ్డి



మారథాన్ విజేతలకు చెక్కులు అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

- ఒలింపిక్స్ స్థాయికి హైదరాబాద్ స్టేడియాలు అప్ గ్రేడ్‌చేస్తం
- 2028లో ఒలింపిక్స్ మెడల్స్ గెలవడమే లక్ష్యంగా ప్రణాళిక
- రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం తెస్తామని వెల్లడి
- హైదరాబాద్ మారథాన్ ముగింపు కార్యక్రమానికి హాజరు

**హైదరాబాద్/గచ్చిబౌలి, ఆగస్టు26** వచ్చే అకడమిక్ ఇయర్‌లోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు దక్షిణ కొరియా స్పోర్ట్స్ వర్సిటీ సహకారం తీసుకుంటున్నట్టు చెప్పారు. గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక మెడల్స్ సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహణ అవకాశం ఇండియాకు దక్కితే.. హైదరాబాద్ నగరంలోనే క్రీడలు నిర్వహించే ప్రధాన వేదిక ఉంచేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ప్రధాని మోదీని అభ్యర్థించినట్టు తెలిపారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్ నగరంలోని పీపుల్స్ ప్లాజా వద్ద ఫుల్ మారథాన్(42 కిలోమీటర్లు), హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్లు) ప్రారంభమై.. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద, 10కే రన్ హైటెక్స్‌లో ప్రారంభమై.. గచ్చిబౌలి స్టేడియంలో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని క్రీడలు, క్రీడల నిర్వహణకు కేరాఫ్‌అడ్రస్‌గా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని స్టేడియాలను ఒలింపిక్స్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్రీడా ప్రాంగణాల్లో సౌలతులను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. రాబోయే ఖేలో ఇండియా యువ క్రీడల నిర్వహణకు తెలంగాణకు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రిని కలిసి, విన్నవించామని చెప్పారు. దేశంలో ఏ క్రీడలు జరిగినా హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్రీడల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించాల్సిన హైదరాబాద్ నగరం గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాధాన్యత కోల్పోయిందని చెప్పారు. తెలంగాణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నామని, రాష్ట్రంలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకువచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుందని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ హనుమంతరావు, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్‌డేవిస్, మాదాపూర్‌డీసీపీ వినీత్, బాక్సర్ నిఖత్ జరీన్, మారథాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా మారథాన్..

హైదరాబాద్ రన్నర్స్‌సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ ఎడిషన్ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ప్రారంభమైంది. పీపుల్స్ ప్లాజా నుంచి ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, హైటెక్స్ వేదిక నుంచి 10కే రన్ ప్రారంభమై.. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వరకు సాగింది. ఈ రన్‌లో నగరంతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 25వేల మంది రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు, చిన్నారులు, స్టూడెంట్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పార్టిసిపేట్ చేశారు. ఈ మారథాన్ ద్వారా 80 లక్షల చారిటీ అమౌంట్ రైజ్ అయినట్టు నిర్వాహకులు తెలిపారు.

### ☰ క్విక్ బైట్స్



## హైదరాబాద్ మారథాన్‌లో కానిస్టేబుల్ దంపతులకు గోల్డ్‌మెడల్

**42.2 కిలోమీటర్లలో భర్త, 21.1 కిలోమీటర్లలో భార్య సత్తా**

ఖమ్మం రూరల్, ఆగస్టు 26 హైదరాబాద్ లో ఆదివారం నిర్వహించిన ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌లో ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లికి చెందిన కానిస్టేబుల్ దంపతులు రేగళ్ల గోపి, బీరెల్లి లక్ష్మి గోల్డ్‌మెడల్ సాధించారు. 42.2 కిలోమీటర్ల పరుగు పందెంలో గోపి 4 .17 గంటల్లో, 21.1 కిలోమీటర్ల రేంజ్‌లో లక్ష్మి 2.38 గంటల్లో గమ్యాన్ని చేరుకొని, సత్తా చాటారు. గోపి గన్ మెన్‌గా, లక్ష్మి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నారు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి ఎంతో మంది క్రీడాకారులు పాల్గొనగా, గోపి దంపతులు గోల్డ్‌మెడల్ సాధించడంతో వారి స్వస్థలమైన మద్దులపల్లి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరిని రాజకీయ ప్రతినిధులతోపాటు పలువురు అభినందించారు.




హైదరాబాద్‌లో ఐఫియా, టీఆర్టీఎఫ్ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# జాతి నిర్మాణానికి మహిళా సాధికారతే కీలకం

- టీచర్ల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉంది
- ఐఫియా, టీఆర్టీఎఫ్ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు26** అభివృద్ధి చెందిన సమాజం కావాలన్నా, జాతి నిర్మాణం జరగాలన్నా మహిళా సాధికారత అవసరమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పురుషులు పూర్తిగా సాధికారత సాధించినా.. ఆ అభివృద్ధి సగం మాత్రమే అవుతుందని, మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ తొలి సంతకం చేసినట్టు గుర్తుచేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్స్(ఐఫియా), తెలంగాణ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత.. లింగ సమానత్వం'అనే అంశంపై నేషనల్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్టుగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై, మాట్లాడారు. టీచర్ల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ చేపట్టామని తెలిపారు. త్వరలోనే ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. ఆకాశంలో సగం .. అవనిలో సగం అని ఎంత చెప్పుకున్నా ఇంకా మహిళా సాధికారత పూర్తి కాలేదన్నారు.

### మహిళలే నిర్ణయాత్మక శక్తి కావాలి..

అన్ని రంగాల్లో నిర్ణయాత్మక శక్తి మహిళలే కావాలని, అప్పుడు మాత్రమే అభివృద్ధి చెందిన సమసమాజం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళల ఆత్మ గౌరవాన్ని పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో బడుల్లో మౌలిక వసతుల కల్పనలో మహిళలను సంపూర్ణ భాగస్వామి చేసినట్టు తెలిపారు. విద్యతో తారతమ్యాలు తగ్గించడం ద్వారా మహిళా సాధికారత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ప్రొఫెసర్ వై.ప్రశాంతి, ఐఫియా ప్రెసిడెంట్ సుధీకర్ కుమార్, ప్రధాన కార్యదర్శి నబ్ కుమార్ కర్మకార్, స్టాన్లీ కాలేజీ చైర్మన్ కృష్ణారావు, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డి, అశోక్ కుమార్, సుబ్బారెడ్డి, కిరణ్ జ్యోతి, స్వర్ణసమత తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాదిలోనే లబ్ధిదారులకు

# డబుల్ ఇండ్లు!

## వేగం పుంజుకున్న పనులు



- కొత్త ప్రభుత్వం వచ్చాక జోరుగా నిధుల మంజూరు
- 75 కోట్లతో హుజూర్‌నగర్‌లో ఇండ్లకు రిపేర్లు

**హైదరాబాద్, ఆగస్టు26** రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం చివరి దశకు చేరుకున్న డబుల్ బెడ్రూం ఇండ్ల పనులు వేగం పుంజుకున్నాయి. బ్యాలెన్స్ ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులకు ప్రత్యేకంగా నిధులు రిలీజ్ చేసి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాల్లో చివరి దశకు చేరుకున్న పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిపై హౌసింగ్ డిపార్ట్ మెంట్ ప్రత్యేక ఫోకస్ పెట్టి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఇండ్లను లబ్ధిదారులకు పంచితే ఇందిరమ్మ ఇండ్లపై కొంత భారం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పెండింగ్ లో ఉన్న ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తే, నియోజకవర్గాల వారీగా ఎంత మందికి ఇళ్లు లేవో క్లారిటీ వస్తుందని, దీంతో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించవచ్చని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు.

**కొల్లూరులో పనులు స్పీడప్**

హైదరాబాద్ సిటీ శివారులో కొల్లూరులో భారీ ఎత్తున డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం చేపట్టింది. సుమారు 16 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి గత ఏడాది ఎన్నికల ముందు అప్పటి సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. వీటిని లబ్ధిదారులకు అందజేసినా కరెంట్, నీటి సరఫరా అంశంలో జల మండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ మధ్య ఫండ్ల వివాదం నెలకొంది. దీంతో అక్కడ లబ్ధిదారులు ఉండడం లేదు. నీటి, కరెంట్ సరఫరాకు రూ.60 కోట్లు చెల్లించాలని జల మండలి, విద్యుత్ శాఖ కోరడంతో ఇటీవల నిధులును జీహెచ్ఎంసీ చెల్లించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ప్రాజెక్టులో చాలాకాలం ఇళ్ల నిర్మాణం పూర్తయి పబ్లిక్ ఉండకపోవడంతో తలుపులు, కిటికీలు, వైరింగ్‌ను దొంగలు దొంగిలించారు. దీంతో వీటి మరమ్మతులు కూడా వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు రాంపూర్, కుత్బుల్లాపూర్, పోచారం, మహేశ్వరం ప్రాంతాల్లో కూడా చివరి దశకు చేరుకున్న పనులు పూర్తిచేస్తున్నామని, వచ్చే 2 నెలల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

**జగిత్యాలలో పనులు వేగవంతం**

జగిత్యాల మున్సిపాలిటీలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 4,520 ఇండ్లు మంజూరైన ఏకైక మున్సిపాలిటి ఇది. అయితే ఇళ్ల నిర్మాణం పూర్తయినా నిధుల కొరతతో రెండేళ్లుగా నిలిచిన డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంక్, వివిధ అభివృద్ధి పనులు, వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటిలో 3722 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించగా మిగతా ఇళ్లు అప్పగించేందుకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు. డ్రైనేజ్, సెప్టిక్ ట్యాంకులు, కరెంట్ కనెక్షన్ తో పాటు మౌలిక వసతులు పూర్తిచేయాలని గతంలో లబ్ధిదారులు ఆందోళన చేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వసతుల కల్పనకు రూ. 32 కోట్లు మంజూరు చేసింది. పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే దసరాకు లబ్ధిదారులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పలుసార్లు సీఎం రేవంత్ రెడ్డి, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేయగా ఫండ్స్ రిలీజ్ చేశారు.

**పదేండ్లుగా పెండింగ్ లో పనులు**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని ఫణిగిరిగుట్ట వద్ద 2014 జనవరిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2,160 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. రాజీవ్ గృహంకల్ప పథకం కింద 25 ఎకరాల్లో రూ.98.50 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. రూ.38 కోట్లు రిలీజ్ చేయగా దాదాపు 40 శాతం పనులు పూర్తి చేశారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రాజీవ్ గృహకల్ప పథకాన్ని రద్దు చేయడంతో 2014 సెప్టెంబరులో పనులు ఆపేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ సుమారు రూ. 75 కోట్లను ప్రభుత్వం నుంచి మంజూరు చేపించారు. పలుసార్లు హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

### మంత్రి ఉన్నా పనులు పెండింగ్

సూర్యాపేట జిల్లా కేసారం వద్ద నాలుగేండ్ల క్రితం రూ.25.44 కోట్లతో 480 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 60 శాతం పనులు పూర్తిచేయగా 40 శాతం పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి.. లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చారు. కానీ, ఇండ్లను అలాట్ చేయలేదు. దీంతో లబ్ధిదారుల నుంచి ఒత్తిడి రావడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయంలో రోడ్లు, డ్రైనేజీ, కరెంటు పనుల కోసం రూ.3 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం వాటి పనులు జరుగుతున్నాయి. మరో 10 శాతం పనులు పూర్తయితే లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

# పల్లా ఇంచు భూమినీ కబ్జా చేయలే

## అన్ని అనుమతులతోనే కాలేజీలు, హాస్పిటల్ కట్టిండు: హరీశ్ రావు

- హైడ్రా పేరిట వాటిని కూల్చేందుకు సర్కార్ కుట్ర
- కబ్జా చేసినట్లయితే నోటీసులు ఇచ్చి నిరూపించాలె
- రాష్ట్రంలో విష జ్వరాలు వ్యాప్తి.. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సూచన



**హైదరాబాద్, ఆగస్టు26** కాంగ్రెస్ సర్కార్ హైడ్రా పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియాతో హరీశ్ రావు మాట్లాడారు. పల్లా ఉద్యమకారుడు, నిజాయతీపరుడు అని, ఇంచు భూమిని కూడా కబ్జా చేయలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక పల్లాపై, ఆయన కుటుంబసభ్యులపై ఆరు కేసులు పెట్టిందన్నారు. నోటీసులు ఇవ్వకుండా హైడ్రా పేరిట ఆయన ఆస్తులను కూల్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా పల్లా ఆక్రమించుకోలేదని, అన్ని పర్మిషన్లతో మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు, హాస్పిటల్ నిర్మించారని చెప్పారు. ఇవి బఫర్ జోన్ లేదా ఎఫ్టీఎల్ పరిధిలో లేవని అప్పటి కలెక్టర్ క్లియరెన్స్ కూడా ఇచ్చారని తెలిపారు. హెచ్ఎండీఏ పర్మిషన్ కూడా ఉందన్నారు. వీటిని కూల్చేస్తే స్టూడెంట్లు, పేషెంట్లు ఇబ్బందులు పడతారన్నారు. ఒకవేళ కబ్జా జరిగిందని భావిస్తే నోటీసులు ఇచ్చి నిరూపించాక కూల్చేయాలన్నారు. అధికారులు అత్యుత్సాహానికి పోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని హెచ్చరించారు. ప్రజలు విష జ్వరాలతో అల్లాడుతుంటే, ప్రభుత్వం ప్రత్యర్థులపై విషం చిమ్ముతోందని హరీశ్ ఆరోపించారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని, లేకుంటే ఇబ్బందులు తప్పవన్నట్టుగా సీఎం తీరు ఉందన్నారు.

**హెల్త్ ఎమర్జన్సీ పెట్టాలె..**

రాష్ట్రంలో ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతున్నారని, ప్రతి ఇంట్లోనూ ఇద్దరు జ్వరంతో ఉన్నారని హరీశ్ రావు తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వ్యాపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఒక్కో బెడ్డుపై ముగ్గురు పేషెంట్లను పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారని, ప్రైవేటు హాస్పిటళ్లలోనూ బెడ్లు దొరకట్లేదన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ పెట్టి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. రుణమాఫీపై ప్రభుత్వం సాకులు చెప్తోందని విమర్శించారు. వెంటనే రుణమాఫీ పూర్తి చేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు అప్పుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తాము 9 ఏండ్లలో రూ.4.26 లక్షల కోట్ల అప్పులు చేశామని.. ప్రస్తుత సర్కార్ మాత్రం 8 నెలల్లోనే రూ.65 వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఈ లెక్కన 5 ఏండ్లలోనే రూ.4.87 లక్షల కోట్ల అప్పుచేసే చాన్స్ ఉందన్నారు.

# మల్లారెడ్డి, పల్లా చెరువులను ఆక్రమించారు

- అక్కడ కాలేజీలు, వ్యాపార సంస్థలు నిర్మించారు: నారాయణ
- ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయడాన్ని స్వాగతిస్తున్నం



**హైదరాబాద్, ఆగస్టు26** మాజీ మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చెరువులను ఆక్రమించారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ఆరోపించారు. ఆ భూముల్లో కాలేజీలు, యూనివర్సిటీలతో పాటు వ్యాపార సంస్థలను నిర్మించారని చెప్పారు. వారితో పాటు ఇతరులు కబ్జాలు చేసిన భూములపై హైడ్రా కొరడా ఝుళిపించాలని కోరారు. పైకి రాజకీయ నాయకులుగా నటిస్తూ లోపల కబ్జాలకు పాల్పడుతున్నారని, హైదరాబాద్‌లో నాలాలు, చెరువులు, కుంటలు కబ్జా కావడంతో పదినిమిషాలు వర్షం పడితే సిటీ నరకంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

**భూములు ఆక్రమించడం తగదు**

సినీ హీరో నాగార్జున అధినేతగా ఉన్న ఎన్ కన్వెన్షన్ నిర్మాణాలను కూల్చిన ప్రదేశాలను ఆదివారం ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. చెరువు ఎఫ్టీఎల్‌లో ఉన్న భూమిలో ఫంక్షన్‌హాల్ కట్టి కోట్లాది రూపాయలు సంపాదించాడని, ఆ డబ్బు రికవరీ చేసి పేద ప్రజలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగార్జున అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ భూములను ఆక్రమించడం తగదన్నారు. సినిమాలలో నటిస్తే కోట్ల రూపాయలు ఆయనకు వస్తాయని, ఇలా భూముల కబ్జా కక్కుర్తి ఎందుకని విమర్శించారు. హైడ్రాతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో సీఎం రేవంత్ రెడ్డి పులి మీద స్వారీ చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో ఎంఐఎం ఆక్రమించినన్ని భూములు ఇంకెవరూ ఆక్రమించలేదని ఆరోపించారు. ఆ భూములను కూడా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా వ్యవహరించి ఏ పార్టీ వారైనా అక్రమ నిర్మాణం చేపట్టినా హైడ్రా కూల్చివేతలు చేపట్టాలని చెప్పారు. పేద, మధ్యతరగతి పేదవారు నోటరీ భూముల్లో ఇండ్లు కట్టుకున్నారని, అలాంటి వారికి రెగ్యులర్ చేయాలని కానీ, వారి పొట్ట కొట్టవద్దని కోరారు. ఆయనతో పాటు సీపీఐ నేతలు పశ్య పద్మ, పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, తదితరులు ఉన్నారు.

# బండి సంజయ్ పీఎస్‌గా వంశీ

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ,ఆగస్టు26** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రైవేట్ సెక్రటరీ (పీఎస్) గా ఐఏఎస్ అధికారి ఆంధ్ర వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్ల పాటు సంజయ్ కు వంశీ పీఎస్ గా ఉంటారని కేంద్రం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలుకు చెందిన వంశీ 2011 నుంచి ఉత్తర ప్రదేశ్ కేడర్ అధికారిగా సేవలందిస్తున్నారు. ఉద్యోగంలో చేరిన అనతి కాలంలోనే సమర్థవంతమైన ఆఫీసర్ గా ఆయన పేరు తెచ్చుకున్నారు. యూపీలోని మథుర, ప్రయాగ్ రాజ్, ఝాన్సీ, పిలిభిత్, షాజహాన్ పూర్ తదితర జిల్లాల్లో కలెక్టర్ గా పనిచేశారు. అనంతరం లక్నోలో స్కిల్ డెవలప్ మెంట్ మిషన్ డైరెక్టర్ గా పనిచేశారు. 2006లో హైదరాబాద్ జేఎన్టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఆయన పట్టా పొందారు. ఆ తర్వాత కొంతకాలం సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2011లో ఐఏఎస్ అధికారిగా విజయం సాధించారు.

## సౌదీ ఎడారిలో కరీంనగర్ యువకుడి విషాదాంతం

- జిపిఎస్ లోపంతో దారితప్పి డస్సిపోయి మృతి

దుబాయ్: లోకేషన్ సంబంధిత జిపిఎస్ సిగ్నల్ లోపంతో తెలంగాణకు చెందిన షెహజాద్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో దుర్మరణం చెందాడు. సూడాన్ జాతీయుడు ఒక్కడితో కలిసి ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ సూడానీ కూడా చనిపోయాడు. సౌదీ అరేబియాలోని రబ్ అల్ ఖాలీ ఎడారుల్లో కరీంనగర్‌కు చెందిన మొహమ్మద్ షెహజాద్ సంచరిస్తూ ఉండగా సాంకేతిక లోపాలతో జిపిఎస్ నిలిచిపోవడంతో ఆయన మరో వ్యక్తితో ఎడారిలో చిక్కుపడి ఈ క్రమంలో అత్యంత ప్రమాదకర ప్రాంతంలో అలసిపోయి డిహైడ్రేషన్‌తో చనిపోయినట్లు వెల్లడైంది. సౌదీలోని ఓ టెలికమ్యూనికేషన్స్ కంపెనీలో ఈ 27ఏండ్ల యువకుడు మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. 650 కిలోమీటర్ల విస్తారిత ఈ సంక్లిష్ట ఎడారిలో దారితప్పితే ప్రాణాంతకం అవుతుంది. అత్యంత వేడి, ఈదురుగాలులు ఉండే ప్రాంతం, సౌదీ అరేబియా దక్షిణ ప్రాంతం నుంచి పొరుగుదేశాల వరకూ ఇది వ్యాపించి ఉంటుంది. జిపిఎస్ సిగ్నల్ లేకపోవడం, సెల్ ఫోన్ ఆగిపోవడంతో ఇద్దరూ ఎవరికి తమ దుస్థితి తెలియచేయలేకపోయారు. ఎర్రటి ఎండలు, ఆకలిదప్పులతో డస్సిపోయిన స్థితిలో స్పృహ తప్పి చనిపోయినట్లుగా ఆ తరువాత నిర్ధారణ అయింది.. వీరు ఎప్పుడు చనిపోయారనేది తెలియలేదు. అయితే వీరి మృతదేహాలను ఇసుక తెన్నెల మధ్య వీరి వాహనం సమీపంలోనే గుర్తించారు.

## ఒక్క అంగుళం కబ్జా చేయలేదు

- అవాస్తవాలు నమ్మవద్దు : సినీ హీరో నాగార్జున

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: ఎన్ కన్వెన్షన్ సెంటర్ వివాదంపై టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున మరో ట్వీట్ చేశారు. ఎన్ కన్వెన్షన్‌ను పక్కా పట్టా ఉన్న భూమిలో నిర్మించినట్లు మరోసారి స్పష్టం చేశారు. ఒక్క అంగుళం భూమి కూడా మేం ఆక్రమించలేదని, అయితే సెలబ్రిటీల విషయం వచ్చేసరికి భూతద్దంలో పెట్టి చూస్తారని నాగ్ తన ట్వీట్‌లో రాసుకొచ్చారు. ప్రియమైన అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ అంటూ కీలక విషయాలు పోస్ట్ చేశారు. ఎన్ కన్వెన్షన్‌లో కొన్ని ఎకరాల భూమి కబ్జా చేసి నిర్మించినట్లు హైడ్రా శనివారం కీలక ప్రకటన చేయడం తెలిసిందే. అందుకు నాగార్జున కౌంటరిస్తూ ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి తుమ్మిడికుంట చెరువు భూమిలో ఎలాంటి ఆక్రమణ జరగలేదని 24 ఫిబ్రవరి 2014న కోర్టు తీర్పు (ఎస్ఆర్. 3943/2011) ఇచ్చినట్లు నాగార్జున స్పష్టం చేశారు. హైకోర్టులో ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. చట్టాలను తానెప్పుడూ గౌరవిస్తానని, ఎన్ కన్వెన్షన్ కు సంబంధించి ఎలాంటి ఊహాగానాలు, అవాస్తవాలు ప్రచారం చేయవద్దని కోరారు. వాస్తవాలు చెప్పడానికి తాను ఈ ట్వీట్ చేశానని, తమది పట్టా భూమి అని, ఒక్క అంగుళం కూడా కబ్జా చేసింది కాదని నాగ్ మరోసారి పునరుద్ఘాటించారు.

# నేనేం చేస్తున్నానో జనం చూస్తూనే ఉన్నారు

- డ్రగ్స్ పదం వింటేనే భయపడాలి
- నార్కోటిక్స్ టీమ్ సాయంతో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ
- బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ ద్వి దశాబ్ది వేడుకల్లో సీఎం రేవంత్



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ పదం వింటేనే భయపడేలా డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ తెలిపారు. డ్రగ్స్ నుంచి యువతను రక్షించేందుకు ఎంతో కృషి చేస్తున్నామని, రైతులను రుణ విముక్తులను చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. తన కార్యాచరణను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒకే విడతలో రైతులకు రూ.31వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తున్నామని, దేశంలో ఒకేసారి ఇంత మొత్తంలో రైతులకు రుణమాఫీ చేసిన రాష్ట్రం మరొకటి లేదని సిఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకుమారీస్ నడుస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### శాంతిసరోవర్‌కు అండగా ఉంటాం

తుమ్మల నాగేశ్వరరావు 22 ఏళ్ల క్రితం మౌంట్ అబూ సందర్శించారని, వారి సూచనల మేరకు ఇక్కడ ఈ శాంతి సరోవర్ ప్రారంభమైందని ఆయన తెలిపారు. ఇరవై ఏళ్లలో గచ్చిబౌలి పెద్ద నగరంగా అభివృద్ధి చెందిందని, శాంతి సరోవర్ ఈ ప్రాంతంలో ఉండడం సంతోషకరమన్నారు. ఇక్కడ శాంతి సరోవర్ ఉండడం అనేది తెలంగాణ ప్రజలకు గర్వకారణమని సిఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం శాంతిసరోవర్‌కు అండగా ఉంటుందని సిఎం రేవంత్ భరోసా ఇచ్చారు. లీజును రెన్యువల్ చేసి సహకరిస్తామని సిఎం రేవంత్ హామీ ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శాంతి సరోవర్ ఉండడం, అది కూడా హైదరాబాద్‌లో ఉండడం ఆనందాన్ని కలిగిస్తోందని సిఎం రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో చార్మినార్, గోల్కొండ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఉన్నట్టే బ్రహ్మకుమారిలు కూడా ఉన్నారని చెప్పుకోవాలని సిఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎజెండాకు, బ్రహ్మకుమారిల ఎజెండా ఆదర్శంగా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మ కుమారీస్ కూడా డ్రగ్స్ నిర్మూలనకు ప్రయత్నించడం సంతోషకరమని, రైతుల ఆత్మహత్యలు తగ్గించేందుకు కూడా బ్రహ్మకుమారీస్ కృషి చేస్తున్నారని సిఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఆనంద్ మహీంద్రను చైర్మన్‌గా నియమించి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. మరో రెండేళ్లలో శాంతి సరోవర్ లీజు ముగియనున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వం రెన్యువల్ చేయడమే కాకుండా అన్నిరకాలుగా తోడ్పాటు అందిస్తుందని సిఎం స్పష్టం చేశారు.

# ఓ మహిళా.. నీకు హ్యాట్సాఫ్!

- దూసుకొచ్చిన రైలు.. పట్టాల మధ్య పడుకొని ప్రాణం కాపాడుకున్న వైనం
- బషీరాబాద్ మండలం నవాండ్గి రైల్వే స్టేషన్‌లో ఘటన




జర్నలిస్ట్ ఫైల్/బషీరాబాద్

రైలు పట్టాలు దాటుకొని ఇంటికి వెళ్లాలనుకున్న ఓ మహిళ.. అకస్మాత్తుగా రైలు రావడంతో చాకచక్యంగా వ్యవహరించి పట్టాల మధ్యలో పడుకొని తన ప్రాణాలను కాపాడుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా, బషీరాబాద్ మండలం నవాండ్గి రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బషీరాబాద్ మండలం, టాకీ తండాకు చెందిన ఓ మహిళ సొంత పనుల నిమిత్తం బషీరాబాద్ వెళ్లింది. పనులు ముగించుకొని తన తండాకు తిరిగి వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ఎదురుగా ఒక్కసారిగా గూడ్స్ రైలు వచ్చింది. దీనిని గమనించిన ఆమె ఎటూ కదలకుండా రైలు వెళ్లే వరకు స్థానికుల సూచనలు పాటిస్తూ పట్టాల మధ్యనే పడుకుంది. రైలు పట్టాల మీదనే వెళ్లినప్పటికీ ఆమెకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దీంతో ఆమె హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుంది. రైలు ప్రమాదం నుంచి చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలను కాపాడుకొన్న మహిళ ధైర్యాన్ని పలువురు అభినందించారు. ఇదంతా అక్కడున్న వారు వీడియో తీయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## నా పేరుతో వసూళ్లకు పాల్పడేవారిని నమ్మొద్దు

- సిఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి విజ్ఞప్తి

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: తన పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, దయచేసి వారిని నమ్మొద్దని సిఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ట్విట్టర్‌లో ఆయన ఓ పోస్ట్ పెట్టారు. ఇటీవల కొందరు వ్యక్తులు తన పేరును ఉపయోగించి డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన విషయం తన దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాచకొండ సిపి, వారి పోలీస్ బృందం ఆ గ్యాంగ్‌ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. కావున ఇక నుంచి ఎవరైనా తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, మళ్లీ అలాంటి కాల్స్ వస్తే తమ ఆఫీస్ సిబ్బందిని సంప్రదించాలని, వేం నరేందర్ రెడ్డి ఎక్స్ ద్వారా సూచించారు.

## ఏలూరులో వందే భారత్ హాల్ట్

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్ : ఎపిలోని ఏలూరు జిల్లా ప్రజలకు 'వందే భారత్' రైలు అందుబాటులోకి వచ్చింది. ఈ రైలుకు ఏలూరు హాల్ట్ ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. ఆదివారం మంత్రి పార్థసారథి, ఎంపి పుట్టా మహేశ్ కుమార్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్, రోషన్ కుమార్, జనసేన, బిజెపి నాయకులు ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు ఘన స్వాగతం పలికి ఆ తర్వాత జెండా ఊపి రైలును ప్రారంభించారు.

# చిత్రపురి సిత్రాలు!

## దొంగచాటుగా జి ప్లస్ టూ నిర్మాణాలు

## 225 విల్లాలకు ఏవీ అనుమతులు?

- 15 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే కూల్చివేత
- మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులు

జర్నలిస్ట్ ఫైల్/నార్సింగి: దొరికితే దొంగ.. దొరక్కపోతే దొర అన్నచందంగా మారింది మణికొండ మున్సిపాలిటీలోని చిత్రపురి కాలనీ అసోసియేషన్ పరిస్థితి. గత కొంత కాలంగా పలు వివాదాల నడుమ కాలం వెల్లదీస్తున్న తరుణంలో కొద్ది రోజుల క్రితం చిత్రపురి కాలనీలో నిర్మించిన 225 రోహౌస్ విల్లాలకుగాను అనుమతులకు విరుద్ధంగా అదనంగా నిర్మించిన 7 విల్లాలను అధికారులు నేలమట్టం చేసిన ఘటన తెలిసిందే. అయితే, ఈ సంఘటన మరువకముందే, తాజాగా జివో నంబరు 658 రెవెన్యూ చట్ట ప్రకారం అక్కడ రోహౌస్ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని, సదరు నిర్మాణాలపై అనుమతులు ఏ విధంగా తీసుకున్నారనే విషయాలపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే 225 విల్లాలను నేలమట్టం చేస్తామని మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దీంతో సినీ కార్మికుల గుండెల్లో గుబులు మొదలైంది. గత పాలకవర్గంలో దొంగచాటున అనుమతులను పొంది, జి ప్లస్ వన్‌కు బదులుగా జి ప్లస్ టూ నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా గత పాలకవర్గం చేసిన తప్పులకు రూ. 50కోట్ల నష్టం జరిగిందంటూ కొందరు ఫిర్యాదు చేశారు. చిత్రపురి కాలనీ అసోసియేషన్‌లో కొంతకాలంగా అవినీతి, అక్రమాలు గుట్టలుగా పేరుకుపోతూ కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండటంతో సామన్య సినీ కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖల అధికారుల పరవేక్షణలో అవినీతి, అక్రమాలు బయటపెట్టాలని పలువురు కోరుతున్నారు.

# కూల్చివేతలు ఓ హైడ్రామా

- పల్లాను ఆర్థికంగా దెబ్బకొట్టాలన్నది కాంగ్రెస్ సర్కార్ ఎత్తుగడ
- బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు ఆరోపణ

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట హైడ్రామా నడుపుతోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ కండువా కప్పుకోకపోతే ఇబ్బంది పెడుతున్నారని ఆక్షేపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలతో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పల్లా రాజేశ్వరరెడ్డిని ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఆయనను ఆర్థికంగా దెబ్బకొట్టాలని కాంగ్రెస్ సర్కారు చూస్తోందని విమర్శించారు. అక్రమంగా కాలేజీలు నిర్మించారని నిరూపిస్తే పల్లా రాజేశ్వరరెడ్డే అక్రమ నిర్మాణాలను కూలగొడతారన్నారు. హైడ్రాకు తాము వ్యతిరేకం కాదని, అక్రమకట్టడాలు ఉంటే కూల్చివేయాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 99 శాతం ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్ల పెంపునకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలకు కళాశాలలకు మాత్రం అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. ఉద్యమ నాయకుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు.

### రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ

ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం మాత్రం ప్రత్యర్థులపై విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజలు పిట్టల్లా రాలుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. రాష్ట్రంలో డెంగీ కేసులు 36 శాతం పెరిగాయని, ఈ విషయంపై ప్రభుత్వం ఒక్క సమీక్ష చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### న్యాయస్థానాల్లో చూసుకుంటాం : పల్లా

తాము 25 ఏళ్ల నుంచి విద్యాసంస్థలు నడుపుతున్నానని, కానీ తొమ్మిది నెలలుగా రోజూ తమను ఇబ్బంది పెడుతున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాము కళాశాల భూములకు గతంలో నీటిపారుదల శాఖ అనుమతులు ఇచ్చిందని, వాళ్లే ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొన్నారు. తన సొంత భూమిలో నిబంధనల మేరకు సంబంధిత శాఖల అనుమతితో కళాశాలల నిర్మాణాలు చేసుకున్నట్లు వివరించారు. మీడియా సమక్షంలో సర్వేచేసి ఆ భూమిని నిర్ధారించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా తాము న్యాయస్థానాల ద్వారానే చూసుకుంటానని తెలిపారు.




## బిసిలు, దళిత గిరిజనులకు న్యాయ సహాయం అందించండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్ : బలహీన వర్గాలకు దళిత గిరిజనులకు న్యాయ సహాయం అందించాలని న్యాయవాదులకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. న్యాయ పరంగా బలహీన వర్గాలకు రావాల్సిన దానిపై అండగా ఉండాలని ఆయన కోరారు. మన హక్కులను సంబంధించి న్యాయ పరమైన విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మసబ్ ట్యాంక్ లోని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆరట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబిసి అడ్వకేట్స్ కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన వాట మన భాగస్వామ్యం మన హక్కు అని, హైకోర్టు , జిల్లాల్లో బలహీన వర్గాల సంఖ్య జ్ఞాన సంపద కలిగిన జ్యుడీషియల్ జడ్జ్ వస్తె మన సంఖ్య కూడా చూపెట్టుకోలేని పరిస్థితి ఉందని మంత్రి అన్నారు. మీరు అడుగుతున్న ప్రతి మాట ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. తెలంగాణ ఏర్పాటులో అడ్వకేట్‌ల పాత్ర మరువలేనిదని అన్నారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క నాయకత్వంలో కుల గణన పూర్తి చేస్తామని పొన్నం అన్నారు. గల్లి నుండి ఢిల్లీ దాకా బలహీన వర్గాల న్యాయవాదులు ఏకం కావాలని సూచించారు.

## ఆ ముగ్గురి సాయంతోనే చెరువుల కబ్జా

- కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులపై ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజం

జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుల సహకారంతోనే యథేచ్ఛగా చెరువులు కబ్జాలకు గురయ్యాయని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందే భూములను కబ్జా చేయడానికి అని ఆయన మండిపడ్డారు. పదేళ్లలో బిఆర్ఎస్ నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములు, 111, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ భూములన్ని కబ్జా చేశారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు మార్పించారని, దురాక్రమనకు గురైన ప్రభుత్వ భూములను ఇంచు వదలకుండా కాపాడడానికి సిఎం రేవంత్ హైడ్రాతో ముందుకు పోతున్నారని, ఈరోజు హరీశ్‌రావు, కెటిఆర్‌లు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

### ఎందుకు చర్యలు తీసుకోలేదు

బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎన్ కన్వెన్షన్ అక్రమంగా కడితే హరీశ్‌రావు ఎన్ కన్వెన్షన్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. మీరు ఎందుకు కాళ్లు, చేతులు ముడుచుకు కూర్చున్నారని, పదేళ్లలో హైదరాబాద్ చుట్టుపక్కల చెరువులు, కుంటలు ఆక్రమించుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు ఎంతమందో ఉన్నారని ఆయన ఆరోపించారు. చట్టానికి చుట్టాలు లేరని, ఎవరైనా చూసేది లేదని, ఎంత పెద్ద వారైనా వదిలేదిలేదన్నారు. కాంగ్రెస్ నాయకులవి కూడా కూలగొడుతున్నారని, దూరదృష్టితోనే దురాక్రమనకు గురైన చెరువులు కుంటలను కాపాడడానికి సిఎం రేవంత్ హైడ్రాను తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి, హైడ్రా అధికారులకు మహేశ్ కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు.

## శ్రీకృష్ణుని బాట సదా ఆచరణీయం

మంత్రి సురేఖ కృష్ణాష్టమి శుభాకాంక్షలు



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్ : జీవితాన్ని పండుగగా మలుచుకోవాలన్నదే శ్రీకృష్ణ పరమాత్ముని సందేశమని, కష్టసుఖాలను సమభావంతో స్వీకరిస్తూ, స్థితప్రజ్ఞతతో ముందుకు సాగాలని, ద్వాపర యుగమైనా, కలియుగమైనా, సర్వకాలాల్లోనూ శ్రీకృష్ణుడు చూపిన బాట సదా ఆచరణీయమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ప్రజలకు మంత్రి కొండా సురేఖ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియచేశారు. సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న నేటి ప్రపంచానికి శ్రీకృష్ణ పరమాత్ముని కార్యాచరణ, తాత్వికత దారి చూపిస్తాయన్నారు. జీవన గమనంలో ఎన్ని సమస్యలు ఎదురైనా, ఎన్ని అవాంతరాలు వచ్చినా, కష్టసుఖాలను సమభావంతో స్వీకరిస్తూ, అమూల్యమైన ఈ జీవితాన్ని పండుగగా మలుచుకోవాలన్న సందేశాన్ని శ్రీకృష్ణ పరమాత్ముని జీవితం మనకు అందిస్తుందని మంత్రి అన్నారు. శ్రీకృష్ణుడు తన జీవితంలోని పలు దశల్లో ప్రదర్శించిన లీలలు, మహిమలు భక్తులను పరవశింపచేస్తాయని మంత్రి సురేఖ అన్నారు. ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుని మహోన్నత వ్యక్తిత్వం, జీవన విధానం నేటి కలియుగంలోనూ మనకు గొప్ప ప్రేరణనిస్తాయని మంత్రి తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రవచించిన గీత కేవలం ఆధ్యాత్మిక బోధనలకు మాత్రమే పరిమితం కాదని, అదో విజ్ఞాన భాండాగారమని మంత్రి సురేఖ పేర్కొన్నారు. జీవితంలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధైర్యం, స్థితప్రజ్ఞతతో ముందుకు సాగడానికి కావాల్సిన ప్రేరణను గీత అందిస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ అనే శ్రీకృష్ణుని సందేశమే నేటి పాలక వ్యవస్థలకు మార్గనిర్దేశనం చేసిందని మంత్రి అన్నారు. శ్రీకృష్ణుని జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే ఉట్ల పండుగ జీవితాన్ని ఆట,పాటలతో ఆనందమయం చేసుకోవాలని మంత్రి తెలిపారు. సమస్యల వలయంలో చిక్కుకున్న నేటి ప్రపంచానికి శ్రీకృష్ణుని తాత్వికత సరైన దారిని చూపుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# మరపురాని ఘోరం..

- 40మందిని బలిగొన్న గోకుల్‌చాట్, లుంబినీ పేలుళ్లు
- 17 ఏళ్ల క్రితం జరిగిన దారుణం



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్ : నగరం మొత్తం ఉలిక్కిపడిన రోజు 25 ఆగష్టు 2007. సరిగ్గా 17 ఏళ్ల క్రితం ఈరోజే లుంబినీ పార్క్, గోకుల్ చాట్ బాంబు పేలుళ్ళు జరిగాయి. సాయంత్రం పూట సరదాగా సమయం గడపడానికి బయటకు వచ్చిన అమాయకులు బాంబ్ బ్లాస్ట్ లలో ప్రాణాలు కోల్పోయారు. లుంబినీ పార్కులో ఎప్పటిలానే లేజర్ షో ప్రారంభమైంది. సాయంత్రం ఏడున్నర సమయంలో ముందుగా వందేమా తరం గీతం వింటున్నారు అక్కడకు చేరుకున్న సందర్శకులు. దాదాపు 500 మంది వరకూ ఆ పార్కుల్లో గుమికూడారు. ఆ సమయంలో సీట్ల మధ్యలో పేలిన బాంబు 9 మంది ప్రాణాలు బలిగొంది. వారిలో ఇద్దరు స్పాట్ డెడ్ కాగా తరువాత హాస్పిటల్ లో ఏడుగురు చనిపోయారు. 40 మందికి పైగా గాయాల పాలయ్యారు. చనిపోయిన వారిలో మహారాష్ట్ర నుండి స్టడీ టూరు కోసం వచ్చిన స్టూడెంట్స్ ఏడుగురు ఉండడం అందరినీ కలచి వేసింది. మరో పది నిమిషాల గ్యాప్‌లో కోఠి ప్రాంతంలోని పాపులర్ గోకుల్ చాట్ వద్ద మరో బాంబు పేలింది. ఎక్కువగా నార్త్ ఇండియన్ స్నాక్స్ దొరికే గోకుల్ చాట్ కు సిటీలో మంచి పేరుంది. ఎక్కువగా నార్త్ ఇండియన్స్ అక్కడకు చేరుకుంటూ అంటారు. అందుకే దానిని టార్గెట్ చేసుకున్న తీవ్రవాదులు అక్కడ బాంబ్ పేల్చారు. ఈ ఘటనలో మొత్తం 33 మంది 10మంది స్పాట్ లో మరో 23 మంది హాస్పిటల్ లో చనిపోయారు. 50 మందికి పైగా గాయపడ్డారు.

### ముజాహిద్దీన్ తీవ్రవాదులే

ఈ బాంబు పేలుళ్లకు నిషేధిత తీవ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిద్దీన్ కు చెందిన తీవ్రవాదులే అని తేల్చారు. టైమర్ ఉపయోగించి ఈ పేలుళ్లను జరిపారని విచారణలో వెల్లడైంది. బాంబుల్లో జిలేటిను, అమ్మోనియం నైట్రేట్‌లను వాడినట్టు తేల్చారు. పోలీసులు ఈ కేసులో మొత్తం 8 మంది పై కేసులు పెట్టారు. వారిలో మొహమ్మద్ అక్బర్ ఇస్మాయేల్ చౌదరి, షఫీక్ సయ్యద్‌లకు మరణ శిక్ష విధించిన కోర్టు సరైన సాక్ష్యాలు లేవని మరో ఇద్దరిని విడుదల చేసింది. తరువాత పట్టుబడిన మరో నలుగురికి సుదీర్ఘ విచారణ తరువాత గత ఏడాది ఒక్కొక్కరికీ పదేళ్ళ పాటు కఠిన కారాగార శిక్షను ఎన్ఐఎ కోర్టు విధించింది. ఒబేదుర్ రెహ్మాన్, ధనీష్ అన్సారీ, ఇమ్రాన్ ఖాన్, అఫ్తాబ్ ఆలం అనే ఈ నలుగురుకీ దిల్ సుఖ్ నగర్ బాంబు బ్లాస్టులతో కూడా సంబంధం ఉన్నట్టు తేల్చారు. హైదరాబాద్ లో ఆ తరువాత కూడా కొన్ని ఉగ్రవాద ఘటన లు జరిగినా గోకుల్ చాట్ బాంబ్ బ్లాస్ట్ గుర్తుకు వస్తే ఇప్పటికే హైదరాబాద్ వాసులు ఉలిక్కి పడుతుంటారు. లుంబినీ పార్కు, గోకుల్ చాట్ రెండు పేలుళ్ళు కలిపి మొత్తం 42 మందిని బలి తీసుకున్నాయి. ఎంతో మంది తమ అవయవాలు కోల్పోయారు. నేటికీ జీవనోపాధి కోల్పోయి దయనీయ స్థితి లో బ్రతుకీడుస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. అందుకే ఇలాంటి విషాదాలకు దారుణాలకు కారణం అవుతున్న ఈ సీమాంతర తీవ్రవాదాన్ని పూర్తిగా అంతమొందించే దిశగా ప్రభుత్వాలు కృషి సల్పుతున్నాయి.

## స్వశక్తితో ఎదిగే మహిళలకు అండగా ' మంత్రి లోకేష్'



- మంత్రి నారా లోకేష్ సహకారంతో 100 మంది
- మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ
- స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా శిక్షణ, కుట్టు మిషన్లు అందిస్తున్న నారా లోకేష్
- ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యం
- శిక్షణ పొందిన "62"వ బ్యాచ్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) : మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్ లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 100 మంది మహిళలకు సోమవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 62వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 100 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కు లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నారా లోకేష్‌కు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ మహిళను ఆర్థిక స్వావలంబన సాధించేలా చేసి లక్షాధికారిగా చేయడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమన్నారు. అందుకే స్త్రీశక్తిని ఏర్పాటు చేసి నియోజకవర్గ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైసీపీ పాలనలో మహిళలతోపాటు రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వాసా పద్మ, మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, నియోజకవర్గ తెలుగు మహిళా అధికార ప్రతినిధి యలమంచిలి పద్మజ, నియోజకవర్గ అంగన్వాడీ సెల్ కార్యదర్శి దివిలక్ష్మి, పట్టణ తెలుగు మహిళా కార్యదర్శి ఉడతా లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వెనక్కి వెళ్లిన వైజాగ్ బీచ్



- తీరంలో బయటపడ్డ రాళ్లపై పర్యాటకుల సందడి

విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్): వైజాగ్ బీచ్ 400 మీటర్లు వెనక్కువెళ్లడంతో తీరంలో కనబడుతున్న రాళ్ళపై టూరిస్టులు తెగ సందడి చేస్తున్నారు. బీచ్ లో ఎగిసిపడే అలలను చూస్తే పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారిపోతారు. సరదాగా నీళ్లల్లో ఆడుతూ సేదతీరుతారు. అదే అలలు కాస్త వెనక్కివెళితే.. రోజూ నీళ్లలో మునిగి ఉండే తీరం ఇంకాస్త బయటపడితే..? అరుదుగా జరిగే ఇలాంటి సంఘటనే సాయంత్రం వైజాగ్ లోని ఆర్కే బీచ్ లో చోటుచేసుకుంది. సముద్రం దాదాపుగా నాలుగు వందల మీటర్లు వెనక్కి వెళ్లింది. దీంతో తీరంలోని రాళ్లు బయటపడ్డాయి. బీచ్ లో సేద తీరేందుకు వచ్చిన జనం ఇది చూసి ఆశ్చర్యపోయారు.

## రాష్ట్రంలో మంకీపాక్స్ కలకలం..

- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : ప్రపంచవ్యాప్తంగా హడలెత్తిస్తున్న మంకీపాక్స్ ఏపీలోనూ కలకలం రేపింది. దుబాయ్నుంచి విజయవాడకు వచ్చిన ఓ చిన్నారికి మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లు వార్తలు రావడంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందుకోసం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరు పడకలతో ఓ వార్డును సిద్ధం చేసింది. అందులో అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచింది.

సూపర్స్పెషాలిటీ బ్లాక్‌లో ఈ ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్డాక్టర్వెంకటేష్తెలిపారు. అన్ని రకాల ఇంజక్షన్లను అందుబాటులో ఉంచామని ఆయన చెప్పారు. ఇప్పటికే భారత ప్రభుత్వం దీనిపై అప్రమత్తమైంది. ఇదిలావుంటే డబ్ల్యూహెచ్‌వోహెచ్చరికల నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. అన్ని రాష్ట్రాల్లోనూ టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది.

అన్ని విమానాశ్రయాలను అప్రమత్తం చేసి విదేశాల నుంచి వచ్చేవారికి వైద్య పరీక్షలు చేయాలని తెలిపింది. ఇటు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. హైదరాబాద్‌లోని గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. గాంధీ ఆస్పత్రిలో ఇందుకోసం ప్రస్తుతం 20 పడకలు కేటాయించారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. తాము పూర్తి స్థాయి అప్రమత్తంగా ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు.

## బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ



తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా భద్రత ఏర్పాట్లను సోమవారం టీటీడీ సీవీఎస్‌వో శ్రీధర్ పరిశీలించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

వాహనమండపం, భక్తులు గ్యాలరీలలోనికి వచ్చేందుకు మాడ వీధులలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, గ్యాలరీలలోని ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల పార్కింగ్, తదితర అంశాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, ఆర్యోగ శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు

## అన్నక్యాంటీన్లలో ఒక్కరోజు భోజనం ఖర్చును విరాళంగా ఇచ్చిన సెల్ కాన్ సీఎండీ

- తన జన్మదినం సందర్భంగా 100 అన్నక్యాంటీన్లలో భోజనానికి రూ.26.25 లక్షలను సీఎం చంద్రబాబుకు విరాళంగా అందజేత

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోన్న అన్నక్యాంటీన్లకు విరాళం అందించేందుకు ప్రజలు, దాతలు విరివిగా ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వ్యాపారవేత్త, సెల్ కాన్ సీఎండీ వై. గురుస్వామి నాయుడు రూ. 26.25 లక్షలను అన్నక్యాంటీన్లకు విరాళంగా అందించారు. ఈ నెల 31వ తేదీన తన జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 100 అన్నక్యాంటీన్లలో భోజనం ఖర్చుకు ఆ మొత్తాన్ని ఖర్చు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వేలమంది కడుపు నింపుతున్న ఈ కార్యక్రమంలో తన వంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు గురుస్వామి నాయుడు తెలిపారు. పేదలకు రూ.5లకే అన్నం పెట్టాలనే మంచి ఉద్దేశంతో ప్రారంభించిన అన్నక్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములయ్యేందుకు వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు ముందుకు రావడం అభినందనీయమని సీఎం అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా అన్నక్యాంటీన్లలో ఒక రోజు భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చిన



గురుస్వామి నాయుడుని సీఎం చంద్రబాబు అభినందించారు. పేదల కడుపు నింపే ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు ఎవరైనా తమకు తోచిన స్థాయిలో విరాళం అందించవచ్చని సీఎం అన్నారు.

## శ్రీశైలంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి.. గోకులంలో విశేష గోపూజలు..

శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్): కృష్ణాష్టమి సందర్భంగా శ్రీశైలం దేవస్థానంలో ఉదయం గోవుపూజ ఘనంగా నిర్వహించారు. క్షేత్రంలో నిత్యం ప్రాతఃకాలంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండగా జన్మాష్టమి సందర్భంగా నిత్యసేవతో పాటు విశేషం జరిపించారు. మొదట ఆలయప్రాంగణంలో ఉన్న గోకులంలో ఆవుదూడలకు పూజాధికాలు నిర్వహించారు. అంతకు ముందు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు పూజా సంకల్పం పఠించారు. ఆ తర్వాత కార్యక్రమంగా నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూ జరిపించారు. శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతోనూ గోవులకు షోడశ ఉపచారాలతో పూజాధికాలు జరిపించారు. చివరగా గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. దేవస్థాన గో సంరక్షణశాలలో కూడా శ్రీకృష్ణుడి, గోవులకు పూజలు చేశారు.



వేద సంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉందని.. వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు అన్నీ గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొంటున్నాయని ఆలయ పండితులు తెలిపారు. గోవు సకల దేవతలకు ఆవాస స్థానమని.. దాన్ని పూజించడం ద్వారా దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయని చెప్పారు. జగన్మాత లలితాపరమేశ్వరి గోవురూపంలో భూమిపై సంచరిస్తుందని చెప్పబడిందన్నారు. తాను చేసిన ప్రతిపనిలో వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీకృష్ణపరమాత్ముడు ఆవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోకులంగా పేరొందిన రేపల్లెలో పెరిగి గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి.. గోవు అనంత మహిమను లోకానికి తెలియజేశాడని.. ఈ కారణంగానే గోకులాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఈవో డీ పెద్దిరాజు, ఏఈవో ఐఎన్‌వీ మోహన్, పర్యవేక్షకురాలు స్వర్ణలత, అర్చకులు పాల్గొన్నారు.

## ప్రతి రెవెన్యూ ఉద్యోగి.. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

- రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్): ఏలూరులోని రెవిన్యూ భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు 26 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు.

**రెవెన్యూ సదస్సులు:**

సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సుల గురించి చర్చించారు. భూ యజమానులు మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, అలాగే భూ రికార్డులను సక్రమంగా నిర్వహించేందుకు, రీ సర్వేలో జరిగిన చిన్న పొరపాట్లను సరిదిద్దేందుకు, ఈ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి ఈ సదస్సులను విజయవంతం చేయడంలో తమ పాత్రను నిర్వర్తించాలని బొప్పరాజు తెలిపారు.

**ఉద్యోగుల పని వాతావరణం:**

రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు సరైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత




ప్రభుత్వానిదేనని, మండలాలు మరియు జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడిన సిబ్బంది కొరతను తక్షణమే తీర్చాలని తీర్మానించారు. తహసీల్దార్ కార్యాలయాలకు సరిపడా నిధులు, అద్దె వాహనాలు, మరియు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరాన్ని కూడా పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నిక:**

ప్రస్తుత రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉన్న రామిశెట్టి వెంకట రాజేష్ ను ఏకగ్రీవంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నారు.

**ఫైళ్ల దహనంపై స్పందన:**

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనం ఘటనపై ఇంకా పూర్తి విచారణ జరగక ముందే ఆ సంఘటనను ఉద్దేశ్యపూర్వకంగా చేసినట్లు వార్తలు రావడం సరికాదని, ప్రజల్లో లేనిపోని అపోహలు కలిగించవద్దని, మీడియా మిత్రులు సహకరించాలని జేఏసీ అమరావతి పక్షాన విజ్ఞప్తి చేశారు.

## 108 రకాల నైవేద్యాలతో ఇస్కాన్ టెంపుల్‌లో జన్మాష్టమి వేడుకలు..



విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : దేశ వ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం కృష్ణ పక్షంలోని ఎనిమిదవ తిథి నాడు రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు దేవకీ మాత అష్టమ గర్భాన జన్మించాడు. కాబట్టి ఈ రోజున మనం శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటూ ఉంటాం. ఈ వేడుకల కోసం ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతుల నడుమ మెరుస్తున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి అనగానే మనకు గుర్తొచ్చేవి కన్నయ్య జన్మించిన మధుర, బృందావనం. అయితే దక్షిణాదిలోనూ జన్మాష్టమి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కర్ణాటకలోని ఉడిపిలో కన్నయ్య జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఇక ఇస్కాన్ టెంపుల్ ఎక్కడుంటే అక్కడ జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

విజయవాడలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇస్కాన్ టెంపుల్‌లో కొలువైన రాధా కృష్ణులను దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ టెంపుల్ నిర్వహించనుంది. ఆగస్టు 25 ,26, 27 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. నిన్నటి నుంచే వివిధ కార్యక్రమాలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. 108 రకాల నైవేద్యాలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. రాధాకృష్ణులకి 2వేల కిలోలతో పుష్పాభిషేకం నిర్వహించారు. అలాగు ఇస్కాన్ దేవాలయంలో పంచామృతాలతో కలశ అభిషేకాలను సైతం కన్నయ్యకు నిర్వహించారు.

## కాంట్రాక్టు లస్కర్ల ఆకలి కేకలు 13 నెలలుగా జీతాలు పెండింగ్



రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) : నీటిపారుదల శాఖలో క్షేత్ర స్థాయిలో కీలకంగా సేవలందిస్తోన్న కాంట్రాక్టు లస్కర్లు ఆకలి బాధలకు గురవుతున్నారు. ఏడాదికిపైగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పు, మధ్య డెల్టా, హెడ్ వర్క్సు, పెద్దాపురం, ఏలేశ్వరం డివిజన్ల పరిధిలో వీరు సేవలందిస్తున్నారు. సాగునీటి కాలువలకు నీటి విడుదల, గోదావరి వరదల సమయంలో లస్కర్లే కీలకం. కాలువల నుంచి పంట కాలువలకు నీటిని మళ్లించేందుకు వినియోగించే స్లూయిజ్‌లు, కల్వర్టులు, బ్యారేజి గేట్ల పనితీరు, షట్టర్లు, స్లూయజ్‌ల మరమ్మతులు వంటి విధులను వీరు నిర్వహిస్తున్నారు. గోదావరి గట్లు ఎక్కడ బలహీనంగా ఉన్నాయి వంటి అనేక పనులు పర్యవేక్షణ బాధ్యతలను సైతం వీరే చూస్తున్నారు. రైతులకు, అధికారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. తమ బాధలను ఎవరూ పట్టించుకోవట్లేదని వారు వాపోతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి అగస్టు వరకూ మూడు నెలలు బకాయితోపాటు గత ప్రభుత్వం హయాంలో 2023-2024లో ఎనిమిది నెలలు వేతనం, 2022-2023లో ఫిబ్రవరి, మార్చి నెలల వేతనం మొత్తం 13 నెలలు బకాయిలు ఉన్నాయి. లస్కర్లకు నెలకు కాంట్రాక్టు ప్రాతిపదికన రూ. 10,500 వేతనం చెల్లిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 120 మంది కాంట్రాక్టు లస్కర్లకు నెలకు రూ. 12.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. 13 నెలలకు సంబంధించి రూ. 1,63,80,000 బకాయిలు ఉన్నాయి. రెగ్యులర్ లస్కర్లతో సమానంగా పనులు చేస్తున్నా, వీరికి కనీస వేతనం కూడా అందించట్లేదు. రెగ్యులర్ లస్కర్‌కు నెలకు రూ. 50 వేలకుపైగానే వేతనం అందుతుంది.

**సిబ్బంది కొరతతో ఇబ్బందులు**

తూర్పుగోదావరి జిల్లాలో 487 మంది లస్కర్లు అవసరం కాగా, 120 మందితో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 431 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, మరో 2024 కిలోమీటర్ల మేర అనుసంధానమైన చిన్న కాల్వలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉభయ గోదాదరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల్లోని ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. ఈ నేపథ్యంలో రెండు వేల మంది వరకూ లస్కర్ల అవసరం ఉంది. కానీ, ప్రభుత్వ ఈ పోస్టుల భర్తీని పక్కన పెట్టింది. వరదల సమయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకుని చేతులు దులిపేసుకుంటోంది. ప్రతి రోజువారీ విధుల్లో భాగంగా కాల్వలకు నీరు విడుదల చేయడంతోపాటూ సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో కాలువలు, ఏటిగట్లను పర్యవేక్షిస్తున్నారు. లస్కర్ల నియామకం చేపట్టకపోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుంది. దీంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. తాజాగా ప్రభుత్వం మారిన నేపథ్యంలో రాజకీయ వేధింపులు పరిపాటయ్యాయి. టిడిపి కూటమి ప్రభుత్వ అనుకూలమైనవారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో, లస్కర్లు ఉద్యోగ భద్రత కరువై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు

## మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు మృతి

- మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు మృతి బాధాకరం
- రాజకీయాల్లో కష్టపడి ఎదిగిన వ్యక్తి డేవిడ్ రాజు
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు ఆదివారం సాయంత్రం కన్నుమూశా రు. డేవిడ్ రాజు మృతి పట్ల ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలియజేశారు. పాలపర్తి డేవిడ్ రాజు హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. డేవిడ్ రాజు జడ్పీ చైర్మన్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారని వెల్లడించారు. ఈ విషాద సమయంలో డేవిడ్ రాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలుపుకుంటున్నా నని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

పాలపర్తి డేవిడ్ రాజు 1999లో టీడీపీ తరఫున ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. వైసీపీ పార్టీ ఏర్పడ్డాక ఆ పార్టీలో చేరారు. తిరిగి 2017లో టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు టికెట్ ఇవ్వకపోవడంతో డేవిడ్ రాజు మళ్లీ వైసీపీలో చేరారు. వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో ఆయన పలుమార్లు చంద్రబాబును కలిసినప్పటికీ మళ్లీ టీడీపీలోకి రాలేకపోయారు.

ఒంగోలు ( జర్నలిస్ట్ ఫైల్ ) : మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు మృతి బాధాకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం నాడు ఒంగోలు క్లౌపేటలో రెండవ లైన్ నందు డేవిడ్ రాజు స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి మంత్రి బాల





వీరాంజనేయ స్వామి, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...డేవిడ్ రాజు ఎంపీపీ స్థాయి నుంచి కష్టపడి ఎదిగాడని అన్నారు. జడ్పీ చైర్మన్ గా ప్రకాశం జిల్లా అభివృద్ధి కృషి చేశారని, సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలు అందించారని మంత్రి కొనియాడారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ డేవిడ్ రాజు ఏ పదవిలో ఉన్నా ప్రతిక్షణం ప్రజా సేవకు పాటుపడ్డాడని ఉన్నారు. డేవిడ్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467